
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
బుధవారం 1 మే 2024



పోరుకు.. సై

- గెలుపే లక్ష్యంగా దూసుకుపోతున్న గుర్రాలు
- టీడీపీ అభ్యర్థుల ముమ్మర ప్రచారం...
- అడుగడుగునా ప్రజల బ్రహ్మరథం
- ప్రచారానికి అధినేతలు
- త్వరలో ప్రధాని నరేంద్రమోదీ, చంద్రబాబు, లోకేశ్‌ల రాక



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల బరిలో గెలుపే లక్ష్యంగా గుర్రాలు దూసుకుపోతున్నాయి. నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం సోమవారం ముగియడంతో పోటీల్లో నిలబడేవారెవరో తేలిపోయింది. ప్రధాన పార్టీలైన తెలుగుదేశం, వైసీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ పార్టీలు తమ అభ్యర్థులను పోటీలో నిలిపాయి. టీడీపీ, జనసేన, బీజేపీ ఒక కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయి. వైసీపీ ఒంటరిగా బరిలో దిగుతోంది. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎంలు కూటమిగా వస్తున్నాయి. రాజంపేట పార్లమెంటు పరిధిలో జిల్లాలోని ఆరు నియోజకవర్గాలలో తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, రాయచోటి, రాజంపేట నియోజకవర్గాలలో టీడీపీ పోటీలో ఉంది. రైల్వే కోడూరులో జనసేన పోటీ చేస్తోంది. రాజంపేట పార్లమెంటుకు కూటమి తరపున బీజేపీ అభ్యర్థి పోటీలో ఉన్నారు. జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 80 మంది పోటీలో ఉండగా పార్లమెంటుకు 18 మంది పోటీలో ఉన్నారు. ఎన్నికల బరిలో ఉన్న టీడీపీ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా..ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. తమ కూటమి అభ్యర్థుల విజయం కోసం అధినేతలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు పర్యటన చేయనున్నారు. దీంతో ఎన్నికలకు ఇంకా 13 రోజులే మిగిలిన నేపథ్యంలో ప్రచారం ముమ్మరంగా సాగుతోంది.

టీడీపీ అభ్యర్థుల ముమ్మర ప్రచారం

ఎన్నికల ప్రచారంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ముమ్మరంగా చేస్తున్నారు. అభ్యర్థులకు మద్దతుగా వాళ్ల కుటుంబ సభ్యులు రాత్రనక..పగలనక.. ఎండను సైతం లెక్క చేయకుండా ప్రచారం చేస్తున్నారు. రాయచోటిలో టీడీపీ అభ్యర్థి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆయనకు మద్దతుగా ఆయన భార్య, కొడుకు, తమ్ముడు, తమ్ముడి భార్య, అక్క, చెల్లెలతో పాటు ఇంకా పలువురు కుటుంబ సభ్యులు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఒక్కొక్కరు ఒక మండలం బాధ్యతగా తీసుకుని ప్రచారంలో ఉన్నారు. రాంప్రసాద్‌రెడ్డికి మద్దతుగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు, మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డితో పాటు పలువురు ముఖ్యనాయకులు ప్రచారం నిర్వహిస్తున్నారు.

తంబళ్లపల్లె అభ్యర్థి జయచంద్రారెడ్డి నియోజకవర్గ వ్యాప్తంగా కలియ తిరుగుతూ ప్రచారంలో చేస్తున్నారు. అతడి భార్య, ఇతర కుటుంబ సభ్యులు ప్రచారం నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని పలువురు టీడీపీ ముఖ్యనాయకులు జయచంద్రారెడ్డికి మద్దతుగా ముమ్మర ప్రచారం చేస్తున్నారు. మదనపల్లె నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాష గతంలో మాజీ ఎమ్మెల్యేగా పనిచేసి ఉండడంతో ఆ పరిచయాలతో నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇతనికి మద్దతుగా స్థానికంగా ఉన్న పలువురు టీడీపీ ముఖ్యనాయకులు ప్రచారంలో ఉన్నారు. పీలేరులో నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ఉధృతంగా ప్రచారం చేస్తున్నారు. ఆయనకు మద్దతుగా భార్య, కొడుకు, కూతురు, కోడలు ప్రచారంలో ఉన్నారు. ఇంకా పలువురు టీడీపీ ముఖ్యనాయకులు ప్రచారం నిర్వహిస్తున్నారు.

రాజంపేటలో సుగవాసి బాలసుబ్రమణ్యం నియోజకవర్గ వ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇతనికి మద్దతుగా తమ్ముడు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, టీడీపీ ముఖ్యనాయకులు పోలి సుబ్బారెడ్డి, రాష్ట్ర తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు మల్లెల శ్రీవాణితో పాటు జనసేన నాయకులు యల్లటూరు శ్రీనివాసరాజు, ఇతర ముఖ్యనాయకులు ప్రచారం ముమ్మరంగా చేస్తున్నారు. సుబ్రమణ్యం పెద్దనాన్న, చిన్నాన్న కుమారులు పలు మండలాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. రైల్వేకోడూరులో జనసేన తరపున అరవ శ్రీధర్ ప్రచారం చేస్తున్నారు. ఇతడి ప్రచారం మొత్తం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి భుజాలకెత్తుకుని నిర్వహిస్తున్నారు. రాష్ట్ర టీడీపీ నాయకులు కస్తూరి విశ్వనాథ నాయుడు, ఇంకా పలువురు సీనియర్ టీడీపీ నాయకులు ప్రచారంలో ముమ్మరంగా ఉన్నారు. రాజంపేట పార్లమెంటు అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇతనికి మద్దతుగా కొడుకు ప్రచారం చేస్తున్నారు. అన్ని నియోజకవర్గాలలోనూ.. కూటమి తరపున ఆయనకు మద్దతుగా ప్రచారం చేస్తున్నారు.

ప్రచారంలో అధినేతలు

కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఇప్పటికే జిల్లాలోని పలు నియోజకవర్గాలలో అధినేతలు ప్రచారం నిర్వహించారు. మిగిలిన నియోజకవర్గాల్లోనూ ప్రచారానికి త్వరలో రానున్నారు. మదనపల్లె నియోజకవర్గంలో చంద్రబాబు పర్యటించి అభ్యర్థి షాజహాన్‌ను గెలిపించమని ప్రచారం నిర్వహించారు. రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలలో ప్రజాగళం పేరుతో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ గత వారంలో అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. మే 2వ తేదీ రాయచోటిలో చంద్రబాబు పర్యటించనున్నారు. 5న రాజంపేటలో నారా లోకేశ్ పర్యటించనున్నారు. కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 8వ తేదీ పీలేరులో పర్యటించనున్నట్లు సమాచారం. వీరే కాకుండా రాబోయే రోజుల్లో మరింత మంది ముఖ్యనాయకులు కూటమి అభ్యర్థుల గెలుపు కోసం జిల్లాకు ప్రచారానికి వచ్చే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్రంలో కూటమి విజయావకాశాలు మెరుగ్గా ఉండడంతో.. కూటమి అగ్రనేతలు అభ్యర్థుల గెలుపు కోసం నియోజకవర్గాల వారీగా.. సమన్వయకర్తలను నియమించారు. ఎలాగైనా గెలవాలన్న లక్ష్యంతో వ్యూహాలు పన్నుతోంది.

మూడు నిమిషాలకే పీచేముడ్...!

'రోజూ చెప్పే సొల్లే ఇక్కడా చెబుతున్నాడు... ఎండలో నిలబడి వినే బదులు ఇంటికి పోయి టీవీలో చూసుకోవచ్చులే.. పద' అంటూ చాలా మంది సీఎం జగన్ సభ నుంచి తిరుగు ముఖం పట్టారు. 36 నిమిషాలపాటు సాగిన సీఎం జగన్ ప్రసంగం ప్రజలను మెప్పించలేకపోయింది. 'సిద్ధమా పీలేర్...మధ్యాహ్నం ఎర్రటి ఎండలో కూడా మీ బిడ్డను ఆశీర్వదించడానికి షిక్కటి చిరునవ్వుతో ఇక్కడకు వచ్చిన మీకందరికీ కృతజ్ఞతలు' అంటూ ఆయన ప్రసంగం ప్రారంభించగానే చాలా మంది మహిళలు, యువకులు మంత్రం వేసినట్లు సభాస్థలి నుంచి వెనక్కు మల్లుకున్నారు.



సీఎం ప్రసంగిస్తుండగానే వెనుదిరుగుతున్న జనం

- కలికిరిలో సీఎం ప్రసంగం పట్ల ఆసక్తి చూపని ప్రజలు
- పోలీసుల మితిమీరిన జాగ్రత్తలపై ఆగ్రహం
- ఉదయం నుంచి విద్యుత్ కోత.. ఉక్కపోతతో జనం అవస్థలు
- ట్రాఫిక్ ఆంక్షలతో వాహనదారుల ఇక్కట్లు
- అస్తవ్యస్తంగా సభ నిర్వహణ



మాట్లాడుతున్న సీఎం జగన్



సభా స్థలికి దగ్గరలోనే ఉన్న రాళ్ల కుప్ప

పీలేరు/కలికిరి, ఏప్రిల్ 30: కలికిరి పట్టణంలో మంగళవారం జరిగిన ముఖ్యమంత్రి జగన్ ప్రచార సభ అటు సామాన్యులు, ఇటు వైసీపీ శ్రేణుల్లో నిరాశే మిగిల్చింది. ఆయన రొట్టకొట్టుడు ఉపన్యాసాలకే పరిమితం అవడంతో పాటు తన ప్రభుత్వ విజయాల కంటే చంద్రబాబు వైఫల్యాలనే ఏకరువు పెట్టడానికి అధిక సమయం తీసుకోవడంతో సభకు హాజరైన ప్రజలు, వైసీపీ శ్రేణులు పెదవి విరిచారు. నిస్సారంగా సాగిన ముఖ్యమంత్రి ప్రసంగానికి తోడు పోలీసుల మితిమీరిన ఆంక్షలు, నిబంధనలతో ప్రజలు విసిగెత్తిపోయారు. ఒక దశలో ముఖ్యమంత్రే కలుగజేసుకుని కాసింత సమయస్ఫూర్తితో విధులు నిర్వహించాలని పోలీసులను కోరాల్సి వచ్చింది. ముఖ్యమంత్రి సభ కోసం ఎంపిక చేసిన ప్రాంతం కూడా ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. సాధారణంగా కలికిరిలో ఏ రాజకీయ పార్టీ సభ జరిగినా స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేయడం పరిపాటి. నాలుగు రోడ్ల కూడలి విశాలంగా ఉండడంతో పాటు నాలుగు వైపులా ఉన్న ప్రజలకు మాట్లాడేవారు కనిపిస్తూ అందరికీ అనుకూలంగా ఉండేది. అయితే మంగళవారం అందుకు భిన్నంగా నాలుగు రోడ్ల కూడలి నుంచి దూరంగా పోలీసుస్టేషన్ సమీపంలో రోడ్డులోనే ప్రసంగం ఏర్పాటు చేయడంతో ప్రజల్లో గందరగోళం ఏర్పడింది. అలవాటు ప్రకారం చాలా మంది జనం క్రాస్ రోడ్డులోనే నిలబడిపోయారు. రోడ్డు డివైడర్‌కు ఒకవైపు పూర్తిగా సీఎం కాన్వాయి వాహనాలకు రిజర్వ్ చేయడంతో సభ ఏర్పాటు చేసిన రోడ్డుకు సగానికి కూడా జనం చాలలేదు. వేదిక మీదికి వచ్చిన తరువాత పరిస్థితి గమనించిన ముఖ్యమంత్రి దాదాపు 15 నిముషాలపాటు ప్రసంగించకుండా జనం కోసం వేచి చూశారు. అప్పటికీ జనం తన వాహనం దగ్గరకు రాకపోవడం, వస్తున్న ప్రజలకు అడ్డంగా కాన్వాయ్ వాహనాలను అడ్డుగా పెట్టి ఉండడంతో ఆయన తీవ్ర అసహనానికి లోనయ్యారు. కాన్వాయ్ వాహనాలను కాసింత ముందుకు పంపించమని ఆయన ఒకటికి నాలుగుసార్లు అక్కడున్న పోలీసులకు మైక్‌లో చెప్పినా స్పందన లేకపోవడం గమనార్హం. దీంతో ఆయన 'హోం గార్డ్సూ..మాటి మాటికీ ఎందుకలా అడ్డుకుంటున్నారు. అటువైపు ఎందుకు రోడ్డు మూస్తున్నారు' అంటూ మందలించారు. ఆ తరువాత వాహనాలను అక్కడి నుంచి తీసేయడంతో జనం, ముఖ్యమంత్రి సర్దుకున్నారు. పోలీసులు మాత్రం ఆద్యంతం మితిమీరిన అతి ప్రదర్శించడంతో ఆర్టీసీ బస్టాండు రోడ్డు వాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆ రోడ్డులో ఉన్న ప్రతి మేడ మీద కాపలా ఉంటూ ఆయా భవనాల వాసులను కూడా పైకి వెళ్లకుండా ఆంక్షలు విధించారు. సభకు వచ్చిన వాహనాలను పోలీసులు కలికిరి నాలుగు రోడ్ల కూడలి నుంచి సుమారు కిలోమీటరు దూరంలోనే ఆపేయడంతో జనం విసుక్కున్నారు.

ఎర్రటి ఎండలో తమను అనవసరంగా నడిపిస్తున్నారంటూ పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంత చేసినా ముఖ్యమంత్రి సభా స్థలికి సమీపంలో గులకరాళ్ల కుప్ప ఉండడాన్ని చూసిన పలువురు పోలీసుల వైఫల్యాన్ని ఎత్తి చూపారు. మొత్తానికి ఏర్పాట్లు చెత్తగా ఉన్నాయని వైసీపీ శ్రేణులే అసహనం వ్యక్తం చేశారు. సభ ఏర్పాట్లు చేసిన పార్టీ నాయకులు, పోలీసులు కలిసి మొత్తం సభనే రసాభాసగా మార్చేశారని వాపోయారు. ఇక క్రాస్‌రోడ్డులోని ఇళ్లకు ఉదయం నుంచి విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రాంత వాసులు అల్లాడిపోయారు. కొన్ని గ్రామాల్లో సైతం రోజంతా పూర్తిగా కోత విధించారు. ఇక మదనపల్లె నుంచి కలికిరి వైపు రావాల్సిన వాహనాలను ఎప్పుడూ లేని విధంగా వాల్మీకిపురం నుంచి మేడికుర్తి క్రాస్, సొరకాయలపేట మీదుగా మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మళ్లించారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డు తెలియక చాలా మంది వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చింది.

ఆకట్టుకోని సీఎం ప్రసంగం

ఇక ఆద్యంతం పేలవంగా సాగిన సీఎం జగన్ ప్రసంగం జనాన్ని ఏమాత్రం మెప్పించకలేకపోయింది. ప్రసంగంలోని ఏ సందర్భంలోనూ ప్రజల నుంచి వైసీపీ నాయకులు ఆశించిన స్పందన లభించలేదు. ఆయన మాట్లాడిన ప్రసంగం మొత్తం బటన్ నొక్కుడు, పింఛన్ల నుంచి వివిధ రకాల సంక్షేమ పథకాల పేర్లు పదే పదే వల్లెవేయడానికే సరిపెట్టారు. కనీసం రాష్ట్రంలో ఫలానా అభివృద్ధి కార్యక్రమం చేశామని ఒక్కటి కూడా ప్రస్తావించలేకపోయారు. రాబోయే రోజుల్లో చేస్తామని చెప్పడానికి కనీసం ఒక అభివృద్ధి పని పేరు కూడా ప్రస్తావించలేదు. పెండింగ్‌లో ఉన్న హంద్రీ-నీవా గురించి కనీసం ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉన్న టమోటా, పాడి రైతులకు ఊతం కలిగించే కార్యక్రమం చెప్పలేదు. ఎంతసేపూ మీ బిడ్డ..మీ బిడ్డ అంటూ బటన్ నొక్కుడు పథకాలతోనే ప్రసంగాన్ని నింపేశారు. అవకాశం దొరికిప్పుడు మాత్రం చంద్రబాబును విమర్శించడానికి ప్రయత్నించారు. వ్యవసాయానికి పగటి పూట 9 గంటల విద్యుత్తు నిరంతరాయంగా ఇస్తున్నామని చెప్పడంతో జనాలు ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. పగటి పూట 4 గంటలు, రాత్రి మూడు గంటలు వెరసి 7 గంటలు మాత్రమే ఇస్తున్న విషయం సీఎంకు తెలియకపోవడం విడ్డూరంగా ఉందనే వ్యాఖ్యలు వినిపించాయి. ప్రసంగం చివరలో పీలేరు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న చింతల రామచంద్రారెడ్డి, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని ప్రజలకు పరిచయం చేసి గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు జన సమీకరణలో కూడా అనుకున్న స్థాయిలో ప్రయత్నాలు చేసినట్లు లేదు. పీలేరు నుంచి కనీస స్థాయిలో కూడా జనాన్ని తరలించకపోవడం చర్చనీయాంశమైంది. ఆ మండలంలోని ప్రధాన నాయకులంతా సోమవారం రాత్రి నుంచి అజ్ఞాతంలోకి వెళ్లిపోవడమే కారణంగా తెలిసింది. జనసమీకరణకు నియోజకవర్గంలోని ప్రైవేటు విద్యాసంస్థల బస్సులను యథేచ్ఛగా వాడుకున్నారు.

ఏసీబీ వలలో ట్రాన్స్‌కో ఏఈ

- ట్రాన్స్‌ఫార్మర్ బిగించేందుకు రైతు నుంచి డబ్బు డిమాండ్



ఏసీబీకి చిక్కిన ట్రాన్స్‌కో ఏఈ వెంకటరత్నం

కురబలకోట, ఏప్రిల్ 30: కురబలకోట ట్రాన్స్‌కో ఏఈ రత్నం లంచం తీసుకుంటూ మంగళవారం కడప ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. దీనికి సంబంధించి ఏసీబీ డీఎస్పీ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చింతమాకులపల్లె పంచాయతీ చింతపల్లెకు చెందిన రైతు మధుకర్ రెడ్డి తన పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం గత ఏడాది నవంబరులో దరఖాస్తు చేసుకున్నాడు. ట్రాన్స్‌ఫార్మర్‌ను తన పొలంలో బిగించాలని ఏఈని కోరాడు. దీంతో అతను రైతు వద్ద నుంచి రూ.35 వేల లంచం డిమాండ్ చేయగా రూ.32 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. కాగా అంగళ్ల సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఒ కేఫ్‌లో రైతు వద్ద నుంచి డబ్బు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ట్రాన్స్‌కో కార్యాలయంలో ఏసీబీ సిబ్బంది తనిఖీలు చేపట్టారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 30: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిశోర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ సాధారణ ఎన్నికల నిర్వహణపై పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లాలోని 6 నియోజకవర్గాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా నామినేషన్ల ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు. నామినేషన్లకు సంబంధించి రాజంపేట పార్లమెంట్‌లో 18 మంది అభ్యర్థులు, రాజంపేట అసెంబ్లీకి సంబంధించి 12 మంది, కోడూరు 15 మంది, రాయచోటి 15 మంది, తంబళ్లపల్లె 11 మంది, పీలేరు 12 మంది, మదనపల్లె 15 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారన్నారు. ఈ కంటెస్టింగ్ అభ్యర్థులను బేస్ చేసుకుని బ్యాలెట్ పేపర్లు, పోస్టల్ బ్యాలెట్ పేపర్లు తయారు చేస్తామని తెలిపారు. కేంద్ర ఎన్నికల కమిషన్ నుంచి జిల్లాకు ముగ్గురు వ్యయ పరిశీలకులు, ఇద్దరు జనరల్ అబ్జర్వర్లు, ఒక పోలీస్ అబ్జర్వర్ జిల్లాకు వచ్చారని, వీరి డీటెయిల్స్‌ను అభ్యర్థులకు తెలియజేసి వీరిని కలిసే అవకాశం కూడా కల్పిస్తామని తెలిపారు. జిల్లాలో మొత్తం 1609 పోలింగ్ స్టేషన్‌లు ఉన్నాయని, అన్ని పోలింగ్ స్టేషన్‌లలో ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పార్లమెంట్ పరిధిలో అంగవైకల్యం ఉన్న వారికి 2 ప్రత్యేక పోలింగ్ స్టేషన్‌లు ఏర్పాటు, ఉమెన్స్‌కు 2 పోలింగ్ స్టేషన్‌లు, యూత్ పోలింగ్ స్టేషన్లుగా రెండు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పార్లమెంట్ పరిధిలో 15 కంటే ఎక్కువ మంది అభ్యర్థులు వచ్చారు. కాబట్టి ఈసారి రెండు బ్యాలెట్ యూనిట్లు ఉపయోగించాల్సి ఉంటుందన్నారు. హోం ఓటింగ్ మే 3వ తేదీ మొదలు పెట్టి మూడు, నాలుగు రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. మే 11వ తేదీన అభ్యర్థుల ప్రచార కార్యక్రమాలు ఆపివేయడం జరుగుతుందని, 11వ తేదీ నుంచి ఎటువంటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. మే 2వ తేదీ నుంచి ప్రతి నియోజకవర్గంలో బీఎల్‌వోల ద్వారా ఓటర్ స్లిప్పులు పంపిణీ చేస్తామని తెలిపారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

మాజీ సీఎం కిరణ్‌కు హైకోర్టులో ఊరట

రొంపిచర్ల కేసులో తదుపరి చర్యలు నిలుపుదల

అమరావతి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, రాజంపేట లోక్‌సభ బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. చిత్తూరు జిల్లా రొంపిచర్ల పోలీసులు నమోదు చేసిన కేసులో తదుపరి చర్యలన్నింటినీ నిలుపుదల చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను జూన్‌కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి మంగళవారం ఆదేశాలిచ్చారు. ఎన్నికల అధికారి నుంచి ముందస్తు అనుమతి లేకుండా రొంపిచర్ల బస్టాండ్ ప్రాంతంలో సమావేశం నిర్వహించానని ఎంపీడీవో రెడ్డెప్ప ఆచార్య ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ కిరణ్‌కుమార్‌రెడ్డికి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఎన్‌వీ సుమంత్ వాదనలు వినిపించారు. సభలు, సమావేశాలు నిర్వహించుకొనేందుకు ఎన్నికల అధికారి నుంచి ముందస్తుగా అనుమతి తీసుకోవాల్సి ఉందన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత ఎన్నికల అధికారే ఫిర్యాదు చేయాలన్నారు. ప్రస్తుత కేసులో ఎన్నికలతో సంబంధం లేని ఎంపీడీవో ఫిర్యాదు చేశారన్నారు. నిర్ధిష్ట సమయానికి ముందే పిటిషనర్ సమావేశాన్ని ముగించారన్నారు. ఈ వాదనలను పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి.. ఈ కేసులో తదుపరి చర్యలన్నింటినీ నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

ఒక్క చాన్స్ ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా..

● జనసేన పార్టీ అభ్యర్థి అరవ శ్రీధర్

రైల్వేకోడూరు, ఏప్రిల్ 30: ఈ ఎన్నికల్లో ప్రజలు ఒక్క చాన్సు ఇస్తే రైల్వేకోడూరును అభివృద్ధి పథంలో నడిపిస్తామని జనసేన పార్టీ అభ్యర్థి అరవ శ్రీధర్ తెలిపారు. మంగళవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ అభివృద్ధి చేసి చూపించే కూటమికి ఓట్లు ప్రజలు వేస్తారన్నారు. రైల్వేకోడూరులో 20 ఏళ్లుగా ఉన్న పాలకులు ఏమాత్రం అభివృద్ధి చేయ లేదన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గానికి అవసరమైన పనులు చేయలేదన్నారు. వైసీపీ స్వార్థ ప్రయోజనాలకు రాజకీయాలు చేసుకున్నారన్నారు. ఉద్యాన రైతులకు వైసీపీ ప్రభుత్వం చేసింది ఏమీ లేదన్నారు. తాము అధికారంలోకి రాగానే శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయిస్తామన్నారు. రైల్వేకోడూరులో ప్రభుత్వ మార్కెట్ యార్డు ను ఉపయోగం లోకి తీసుకుని వస్తామన్నారు. అనంతరాజుపేట అప్సా జ్యూస్ పరిశ్రమ ప్రారంభానికి కృషి చేస్తామన్నారు. యువత వలసలు ఆపి, స్థానికంగానే పనులు కల్పిస్తామని తెలిపారు. వైసీపీ అరాచకపాలనను అంతం చేసేందుకు కేవలం 10 రోజులు మాత్రమే ఉందన్నారు. ప్రజాదరణ కల్గిన పార్టీ జనసేన అని తెలిపారు. కూటమి పార్లమెంట్ అభ్యర్థి మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి విజయం కోసం కూటమి ముమ్మరంగా ప్రచారం చేస్తోందన్నారు. ఉమ్మడి కడప జిల్లా లో కూటమి బలపరిచిన అభ్యర్థులు అందరూ విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు ప్రవేశపెట్టిన మేనిఫెస్టో పై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.

ప్రచారానికి బ్రహ్మరథం

కూటమి ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరు పట్టణంలోని లక్ష్మీనగర్, బాలానగర్, రంగనాయకులపేట మంగళవారం ముమ్మరంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ అభ్యర్థి అరవ శ్రీధర్ ఎద్దుల బండి తోలారు. ఇంటింటికి వెళ్లి జనసేన పార్టీ గుర్తు గాజుగ్లాసు గుర్తు కు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు టీడీపీ నాయకులు నార్జాల హేమరాజ్, టీడీపీ నాయకులు మస్తాన్, పుల్లెల రమేష్, మండల పార్టీ అధ్యక్షులు కొమ్మా శివ, మైసూరివారిపల్లె సర్పంచ్ కారుమంచి సంయుక్త, జనసేన నాయకులు వరికూటి నాగరాజు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు(రూరల్): గెలుపె లక్ష్యంగా కూటమి నాయకులు తమ ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించారు. మంగళవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు ఆధ్వర్యంలో పట్టణంలోని రంగనాయకులపేట, శ్రీరామ్ నగర్, శివరామకృష్ణ థియేటర్ పరిసర ప్రాంతాలలో ప్రచారం నిర్వహించారు. జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్‌కు రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డికి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైసూరివారిపల్లె సర్పంచ్ సంయుక్త, కోడూరు మాజీ ఉపసర్పంచ్ నార్జాల హేమరాజ్, మైనారిటీ నాయకులు పఠాన్ మౌలా సీనియర్ నాయకులు మస్తాన్, టీడీపీ పట్టణ కన్వీనర్ పోకల మణి, టీడీపీ మండల అధ్యక్షులు కొమ్మ శివ, జనసేన సీనియర్ నాయకులు నాగరాజ్, యువ నాయకులు మల్లెల హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేట: టి.కమ్మపల్లె, ఎగువరెడ్డిపల్లి పంచాయతీలలో ముక్కా రూపానందరెడ్డి కోడలు శిరీష ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. కోడూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామచంద్ర నాయుడు, టీడీపీ పార్టీ కార్యదర్శి లింగుట్ల వెంకటరమణ మాజీ సర్పంచ్ కృష్ణమనాయుడు ఉపాధ్యక్షుడు బాలశేఖర్ నాయుడు, పద్మాకర్‌రెడ్డి, ఈశ్వరయ్య, బీజేపీ నాయకులు కంభాల శ్రీనివాసులు, జనసేన రాయలసీమ జోన్ కార్యదర్శి జోగినేని మణి, రమణ, ఎనమాల సుబ్బయ్య, కటికం మణి, కుప్పాల రామక్రిష్ణ, మల్లి తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు: కొండూరు గ్రామ పంచాయతీలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి, కోడలు వినిషారెడ్డి ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. సిరివరంలో రామాలయం, అభయాంజనేయ స్వామి ఆలయాల్లో పూజలు చేసి సిరివరం, హరిజనవాడ, తిరుణంపల్లె, అరుంధతివాడ, వెలగచర్ల గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచార ఇన్‌చార్జ్ కాకర్ల శివయ్యనాయుడు, వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సి.ధనుంజయనాయుడు మండల పార్టీ మాజీ అధ్యక్షుడు మన్నూరు సత్యనారాయణ, జయరామయ్య, నారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఏ.బాలచంద్రరెడ్డి, ఎం.హరినారాయణ, ఎస్.వెంకటేశ్వరరెడ్డి, డి.పెద్ద వెంగల్ రెడ్డి మండల బీజేపీ అధ్యక్షుడు కొనేరు హరిప్రసాద్ రాయల్ మాజీ అధ్యక్షుడు మన్నెం మల్లికార్జున జనసేన అధ్యక్షుడు గొబ్బురు హరిరాయల్ కార్యదర్శి టి.రాజా, టీడీపీ సాంస్కృతిక విభాగం సభ్యుడు ధనంజయనాయుడు, జిల్లా కార్యదర్శి సుదర్శన్ నాయుడు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు ఎం.శ్రీనివాసులు, కె.శ్రీరాం, హబీబుల్లా మండల నాయకుడు లారీ సుబ్బరాయుడు, కమతం జయరాం, శ్రీనివాసులు, టీ.నవీన్ , శ్రీహరి, బాబురావు, జేసీబీ రామణయ్య కాణల సుధకార్, కె.శంకరయ్య, తోట సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, అజయ్‌బాబు, నందవరం సునంద తదితరులు పాల్గొన్నారు.



ఎద్దుల బండి తోలుతున్న అరవ శ్రీధర్

వైసీపీ పాలనకు చరమగీతం

● టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి



మాట్లాడుతున్న ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు, ఏప్రిల్, 30: కూటమి బలపరిచిన జనసేన పార్టీ అరవ శ్రీధర్ గెలుపు తథ్యమని టీడీపీ రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌ఛార్జ్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. మంగళవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలో జనసేనకు ప్రజల అండదండలు ఉన్నాయన్నారు. వైసీపీని ఈ ఎన్నికల్లో ప్రజల ఆశీస్సులతో ఓడి స్తున్నామని తెలిపారు. ప్రజలు ఈ నెల 13వ తేదిన పోలింగ్ రోజున ప్రజలు కూటమిని గెలిపించబోతున్నారన్నారు. వైసీపీ దుష్టపాలనకు ఛమరగీతం పాడనున్నా రన్నారు. రాష్ట్రంలో ఐదేళ్ల కాలం లో వైసీపీ ప్రజలకు ఏమి చేసింది ఏమి లేదన్నారు. ఎప్పుడు లేని విధంగా కూటమి విజయం ఉంటుంద న్నారు. షణ్ముఖ వ్యూహం తో వైసీపీని ఓడిస్తామన్నారు. వైసీపీ అరాచకరాలు, దాడులు, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు జరిగాయన్నారు. దీంతో ప్రజలు విసుగు చెందారన్నారు. రాజంపేట పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి విజయం తథ్యమన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ముమ్మరంగా పని చేస్తున్నారని తెలిపారు. ఐదు మండలాల్లో మూడు పార్టీలకు చెంది న నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు ప్రచారం చేస్తున్నారన్నారు. ఏ గ్రామం లోకి వెళ్లినా ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని తెలిపారు. ప్రజల్లో మార్పు వచ్చిందన్నారు. వైసీపీ ఈ ఎన్నికల్లో గల్లంతు కావడం ఖాయమని జోస్యం చెప్పారు. కూటమి గెలుపు సులువు గా ఉంటుందన్నారు. జనసేన గెలుపు తో రైల్వేకోడూరు అన్ని రంగాలను అభివృద్ధి చేస్తామన్నారు. కూటమి తో వైసీపీ కూసాలు ఇప్పటికే కదిలిపోయాయని తెలిపారు. ప్రతి గ్రామం లో ప్రజలు హారతులు పడుతున్నారన్నారు. కూటమి అధికారం లోకి రాగానే రైల్వేకోడూరు లో మెడికల్ కాలేజి, కోడూరు-వెంకటగిరి రోడ్డు, ఉద్యాన హబ్, పెనగలూరు లిఫ్ట్ ఇరిగేషన్ తదితర కార్యక్రమాలను చేస్తామ న్నారు. మంగంపేటలో అవినీతి జరగకుండా చేస్తామన్నారు. జరిగిన అవినీతి పై విచారణ చేయిస్తామన్నారు. బైరైటీస్ దొంగలను పట్టుకుని తిన్నదంతా కక్కిస్తామని తెలిపారు. ఎర్రచందనం చెట్ల ను కాపాడేందుకు కృషి చేస్తామన్నారు. స్మగ్లింగ్ జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకునేం దుకు కృషి చేస్తామన్నారు. యువతకు ఉద్యోగాలు ఇస్తారన్నారు. చంద్రబాబు ను ఎప్పుడెప్పుడు ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారన్నారు. జనసేన పార్టీ అభ్యర్థి గెలుపు ను ఎవరు ఆపలేరన్నారు.



రైల్వేకోడూరు పట్టణం బాలానగర్‌లో ప్రచారం చేస్తున్న విశ్వనాథనాయుడు తదితరులు



సిరివరంలో ముక్కా వరలక్ష్మి, అరవ శ్రీధర్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు



పుల్లంపేట మండలంలోని గ్రామాల్లో ముక్కా శిరీషకు హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

లక్కిరెడ్డిపల్లె ఏప్రిల్ 30: టెన్త్, ఇంటర్‌లో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు చక్రేనాయక్, వెంకటససుబ్బయ్య తెలిపారు. మంగళవారం ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రత్యేక తరగతులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య విద్యార్థులకు గణితం బోధించారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యాకానుక సామగ్రి నిల్వ ఉంచడానికి గదులను పరిశీలించారు.

గిరిజన గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సంబేపల్లె, ఏప్రిల్ 30: ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల పాఠశాల (బాలురు)లో భర్తీకి అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ వై. చలపతి మంగళవారం తెలిపారు. 4 నుంచి 9వ తరగతి వరకు ఉన్న బ్యాక్‌లాగ్ ఎస్టీ ఖాళీల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మూడవ తరగతి ఎస్టీ 30, ఎస్సీ 5, బీసీ 2, ఓసీ 1, పీహెచ్‌సీ 1, 4వ తరగతి ఎస్టీ 37, 5వ తరగతి ఎస్టీ 30, 6వ తరగతి ఎస్టీ 23, ఏడవ తరగతి ఎస్టీ 10, 8వ తరగతి ఎస్టీ 17, 9వ తరగతి ఎస్టీ 6 సీట్లు ఉన్నాయన్నారు. మే20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు పాఠశాలలో లభిస్తాయన్నారు. 9987889555, 8142585783 నెంబర్ల ద్వారా సమాచారం పొందవచ్చునన్నారు.

మా గ్రామంలో ప్రచారం చేయొద్దు

వైసీపీ నాయకులకు తెగేసి చెప్పిన గ్రామస్థులు

పుల్లంపేట, ఏప్రిల్ 30: రైల్వేకోడూరు నియోజకవర్గం పుల్లంపేట మండలంలోని టి.కమ్మపల్లె పంచాయతీ టి.బలిజపల్లెలో వైసీపీ నాయకులకు చేదు అనుభవం ఎదురైంది. మంగళవారం మండల అధ్యక్షుడు ముద్దా బాబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు ప్రచారంలో భాగంగా టి.బలిజపల్లె గ్రామానికి వెళ్లగా మా గ్రామంలో ప్రచారం చేయవద్దని గ్రామస్థులు అడుకున్నారు. గతంలో మీకు ఓట్లు వేశామని, ఇప్పుడు మా పవన్ కళ్యాణ్‌కి ఓటు వేస్తామని మీరు ఇక్కడ ప్రచారం చేయొద్దని గ్రామస్థులు తెగేసి చెప్పారు. దీంతో అక్కడ కొంత ఘర్షణ వాతావరణం ఏర్పడింది. అన్న జగన్ ఒక పార్టీ, చెల్లెలు షర్మిల ఒకపార్టీ అన్ని పార్టీలు మీవేన, మాకు పార్టీ వద్దా అంటు గ్రామస్థులు ప్రచారాన్ని అడ్డుకున్నారు. విషయం తెలు సుకున్న పుల్లంపేట ఎస్ఐ రఘురామ సిబ్బందితో గ్రామానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. దీంతో వైసీపీ నాయకులు ఏమీ దిక్కుతోచక ప్రచారం చేయకుండానే ఆ గ్రామం నుంచి వెనుతిరిగారు.

రాయలసీమ బలిజ సంఘం అధ్యక్షుడుగా కొండేటి చలపతి

నందలూరు, ఏప్రిల్ 30: రాయలసీమ బలిజ సంఘం అధ్యక్షుడుగా కొండేటి వెంకటాచలపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కడపలోని రాష్ట్ర కాపునాడు కార్యాలయంలో గ్రేటర్ రాయలసీమ అధ్యక్షుడు గాజులపల్లి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో మంగళవారం బలిజ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు నారాయణస్వామి రాయల్ హాజరయ్యారు. అన్నమయ్య జిల్లా బలిజ సంఘం అధ్యక్షుడుగా నాగేంద్రను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ రాయలసీమ ప్రధాన కార్యదర్శి అబ్బి శెట్టి వెంకటేశ్వర్లు, కడప జిల్లా అధ్యక్షుడు నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య, బలిజ సంఘం నాయకులు హాజరయ్యారు.



నియామకపత్రం అందుకుంటున్న కొండేటి వెంకటచలపతి

జడ్జి లత గుంటూరుకు బదిలీ

నందలూరు, ఏప్రిల్ 30 : మండల లీగల్ సెల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కె.లత ఫిఫ్త్ అడిషనల్ జూనియర్ సివి ల్ జడ్జిగా గుంటూరుకు బదిలీ అయ్యా రు. ఈ సందర్భంగా మంగళ వారం నందలూరు బార్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో శాలువాతో సత్కరిం చారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ప్రీ లిటిగేసన్ కేసులతో పలు కఠినమైన సమస్యలను పరిష్కరించారు.. సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, పనిచేసే చోట లైంగిక వేధింపులపై అవగాహన కల్పించారన్నారు. 12 జాతీయ లోక్ అదాలత్‌లు, 380 న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారని తెలిపారు. అనంతరం జడ్జి కె.లత మాట్లాడుతూ మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్‌గా తాను నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులకు సహకరించిన న్యాయవాదులు, రెవెన్యూ, పోలీసు సిబ్బందికి, పత్రికా విలేకర్లకు, కోర్టు సిబ్బందికి, పారా లీగల్ వలంటీర్లకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.



జడ్జిని సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్షలో కృష్ణవేణికి ఫస్ట్ ర్యాంక్

రామాపురం, ఏప్రిల్30: రామాపురం ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్షల్లో నల్లగుట్టపల్లె బీసీ కాలనీకి చెందిన విద్యార్థులు దేరంగుల కృష్ణవేణి 73 మార్కులతో మొదటి ర్యాంకు సాధించగా ముక్కుపోగు వైష్ణవి 64 మార్కులతో మూడో ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా హెడ్ టీచర్ ఎస్‌యండీ రఫీ, ఉపాధ్యాయురాలు సుజాతలు విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు ర్యాంకు సాధించడానికి కారకులైన ఉపాధ్యాయులను ఆ పాఠశాల తల్లిదండ్రుల కమిటీ సభ్యులు మా పాఠశాల మొదటి, మూడో ర్యాంకులు రావడం సంతోషం వ్యక్తం చేశారు.



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఘనంగా శ్రీశ్రీ జయంతి

నందలూరు, ఏప్రిల్ 30: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శ్రీశ్రీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ పీవో డాక్టర్ పి.నీలవేణి మాట్లాడుతూ తెలుగు జాతి వెలుగు కిరణం శ్రీశ్రీ జయంతి జరుపుకోవడం గర్వకారణమన్నారు.

టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి

● టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి

రామాపురం, ఏప్రిల్ 30: చంద్రబాబునాయుడు ముఖ్య మంత్రి అయినపుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని రాయ చోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి అన్నారు. మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీలోని కొత్తపల్లె, హరిజనవాడ, శివశంకరాపురం, గువ్వలచెరువు గ్రామాల్లో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గువ్వలచెరువు బస్టాండులో వారు రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వైసీపీ ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. గడికోట ద్వారకనాథరెడ్డి మాటా డుతూ తమ కుటుంబాన్ని ఆదరించినట్టే, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కూడా ఆదరించి, సైకిల్ గుర్తుపై ఓటు వేసి తెలుగుదేశం పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా రేఖం బ్రదర్స్ నాగరాజ, ఎంపీటీసీ చిన్నక్క భర్త ఎర్రనాగి ఓబులేసు, ఏనుగుల బాబుతోపాటు 40 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, రేఖం బ్రదర్స్ చంద్రమౌళి, చిట్టి రెడ్డెయ్య, ఏనుగుల సుధాకర్, ఈశ్వర య్య, వెంకటేశ్, సుబహాన్, ఆజాం, ధర్మయ్య, అంజనారెడ్డి, సిలేకాంపల్లె శివారెడ్డి, రామచంద్రారెడ్డి, సూరం శివారెడ్డి, గోవిందరెడ్డి, కుమార్‌రెడ్డి, దానప్ప, రాజానాయక్, మాజీ సర్పంచ్ సీతారాంనాయక్, హరిప్రసాద్, సుబ్బయ్య, కదిరప్పనాయుడు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

కూటమి మేనిఫెస్టో ప్రజలకు వరం

రాయచోటిటౌన్: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు , జన సేన అధినేత పవన్ కల్యాణ్‌లు మంగళవారం విడుదల చేసి మేనిఫెస్టో రాష్ట్రానికి వరంలాంటిదని రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆయన రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని మాసాపేట ఇందిరమ్మ కాలనీలో మీడియాతో మాట్లాడారు. ఈ మేనిఫెస్టోతో రాష్ట్రంలోని అన్ని వర్గాలకు చెందిన ప్రతి కుటుంబానికి లబ్ధి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా మేనిఫెస్టోలోని వివరాలను వెల్లడించారు. మేనిఫెస్టోపై రాష్ట్ర ప్రజల్లో హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

టీడీపీలోనే అన్ని వర్గాల వారికి సమన్యాయం

గాలివీడు, ఏప్రిల్ 30: తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడే రాష్ట్రంలోని అన్ని వర్గాల వారికి సమన్యాయం జరుగుతుందని మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆయన మంగళవారం మండలంలోని గాలివీడు పంచాయతీలో ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేసి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని బల పర్చాలని ఆయన కోరారు. మాజీ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, మాజీ సర్పంచులు మహమ్మద్ రియాజ్, భద్రప్పనాయుడు, ప్రభాకర్ నాయుడు, మాజీ ఎంపీటీసీలు రెడ్డిప్రసాద్‌రెడ్డి, శేషారెడ్డి, రాజంపేట పార్లమెంటరీ టీడీపీ ఉపాధ్యక్షుడు మందపాటి రవీంద్రబాబు, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కేడం లక్ష్మయ్య, మాజీ డీలర్లు జనార్దన్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, శేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, సుబ్బారెడ్డి, చెన్నయ్య, కోటిరెడ్డి, శివ, శ్రీకాంత్, సూరి రెడ్డెప్ప, ప్రసాద్, నాగేశ్వరరావు, రెడ్డెప్పరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మిట్టేనాయక్, టోపీవలి, వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

మండిపల్లి కుటుంబం విస్తృత ప్రచారం

సంబేపల్లె: సంబేపల్లె మండలంలోని శెట్టిపల్లి పీఎస్ కాలనీ సంబేపల్లె గ్రామాల్లో మండిపల్లి కుటుంబ సభ్యులు హరిత, శ్రీలత, విద్య, సౌమ్యరెడ్డి ఇంటింటి ప్రచా రం నిర్వ హించారు. డీసీ వడ్డెపల్లె, ఎగువ హరిజనవాడ, దిగువ హరిజనవాడల్లో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మల్లు నరసా రెడ్డి, మల్లు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో తమ తమ్ముడిని గెలిపించాలంటూ శ్రీలత, విద్యలు ఓటర్లను అభ్యర్థించారు. నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే మండిపల్లి కుటుంబంతోనే సాధ్యమ న్నారు. తమ తండ్రి నాగిరెడ్డి పిన తండ్రి నారాయణరెడ్డి రాయచోటి అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. . జూన్ 4వ తేదీతో వైసీపీ అవినీతి, అరాచక పాలనకు విముక్తి కలుగుతుందన్నారు. .

టీడీపీకి ఓటేద్దాం.. అభివృద్ధిని సాధిద్దాం

చిన్నమండెం, ఏప్రిల్ 30: రాయచోటి నియోజకవర్గ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఓటేద్దాం.. అభివృద్ధిని సాదిద్దాం అంటూ మండల టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మంగళ వారం సాయంత్రం మార్కెట్ యార్డు నుంచి మోతీనగర్, బస్టాండు వరకు బొంబాయ్ ఎజాజ్‌ఖాన్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానికుడు, అందరికీ అందుబాటులో ఉంటూ, ఆదుకునే రాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



కొత్తపల్లిలో రాంప్రసాద్‌రెడ్డి, ద్వారకనాథరెడికి స్వాగతం పలుకుతున్న ప్రజలు



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ముంబై ఎజాజ్‌ఖాన్



గాలివీడులో ఎన్నికల ప్రచారం చేస్తున్న మండిపల్లి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి



శెట్టిపల్లె పీఎం కాలనీలో ప్రచారం చేస్తున్న మండిపల్లి కుటుంబ సభ్యులు



గువ్వలచెరువు రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

కార్యక్రమాల వివరాలు అప్‌డేట్ చేయాలి

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య

రాయచోటిటౌన్, ఏప్రిల్30: ఆరోగ్య కార్యక్రమాల వివరాలు ఆన్‌లైన్‌లో అప్డేట్ చేయాలని అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొండయ్య ఆదేశించారు. మంగళవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అన్నమయ్య జిల్లాలోని 48 పీహెచ్‌సీల పట్టణ ఆరోగ్య కేంద్రాల హెచ్‌ఐ ఎంఎస్ (ఆరోగ్య సమాచార నిర్వహణ వ్యవస్థ) నోడల్ అధికారుల నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీలో వైద్యాధికారుల తర్వాత రిపోర్టులు, క్షేత్రస్థాయిలో కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషిస్తాయని అదే సమయంలో ఆరోగ్య కేంద్రాల నుంచి జిల్లాకు రోజు వారీ, వారం, పక్ష నెలవారీ నివేదికలు ఆన్‌లైన్ చేయడంలో నిర్లక్ష్యంగా ఉండరాదని సూచించారు. ప్రతి పీహెచ్‌సీ నోడల్ అధికారి వారి పీహెచ్‌సీ రిపోర్టులు పెండింగ్ లేకుండా చూసుకో వాల్సిన బాధ్యత వారిదేనన్నారు. అనంతరం డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్ మాట్లాడుతూ హెచ్‌ఎంఐఎస్ పోర్టల్, ఆర్‌సీహెచ్ పోర్టల్, పీఎంవీవీవై అమలులో ఉన్న అన్ని పోర్టల్స్‌లో సమా చారాన్ని ఏ రోజుకు ఆ రోజు అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో హెల్త్ ప్రొఫెషనల్ రిజిస్ట్రేషన్ ఐడీలు చేసు కోవాలని ఆదేశించారు. ప్రస్తుతం వాతావరణంలో ఎండలు ఎక్కువగా ఉన్నందున వడదెబ్బ, వడగాలులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని, వీటికి గురికాకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విరివిగా అవగాహన సమావేశాలు నిర్వహించా లన్నారు . నిర్దేశించిన ప్రాంతాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్స్ నిర్దేశించిన చోట నిల్వలు ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఐవో డాక్టర్ ఉషశ్రీ, ఎస్‌వో ఓబుల్‌రెడ్డి, డీపీవో మునీశ్వర్, ఏపీ డేమోలాజిస్ట్ వెంకటేశ్, జిల్లాలోని వివిధ పీహెచ్‌సీల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రులకు అనుమతి తప్పనిసరి

ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రైవేటు ఆసుపత్రులను నిర్వహిస్తే చర్యలు తప్పవని అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య హెచ్చరించారు. మంగళ వారం ఆయన డీపీఎంవో డాక్టర్ రియాజ్ బేగ్, డీఎన్‌ఎంవో డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి అన్నమయ్య జిల్లా కేంద్రంలో శ్రీవెంకటేశ్వర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను తనిఖీ చేశారు. ఏపీఎంసీఈ చట్టం 2002 ప్రకారం ప్రొటోకాల్ అనుసరిస్తేనే ఆసుపత్రులకు అనుమతి ఇస్తామని తెలిపారు. ఆసుపత్రి ఆవరణలో పార్కింగ్ ప్రదేశంతో పాటు రోగులు వేచి ఉండు గది, పొల్యూషన్ సర్టిఫికెట్, బయోవేస్టేజ్ నిర్వహణ, ఫైర్‌ఎన్‌వోసీ, బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్, వైద్యుల, పారామెడికల్ సిబ్బంది వివరాలు వారి సర్టిఫికెట్లు, మంచినీటి సౌకర్యం, ప్రమాదాల నిర్వహణ, శానిటేషన్, ఆసుపత్రిలో ఉన్న వార్డులు, పడకలు, ల్యాబ్, ఆపరేషన్ థియేటర్ నిర్వహణ, జనరేటర్ ఏర్పాటు మొదలైనవి పరిశీలించారు. ప్రజల ఆరోగ్య భద్రత విషయంలో ప్రైవేటు ఆసుపత్రులు నిర్దేశించిన ప్రమాణాలు పాటించకుంటే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య



శ్రీవెంకటేశ్వర మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కొండయ్య

ఆదరించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా...

● రాజంపేట టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం

ఒంటిమిట్ట, ఏప్రిల్ 30: ఆదరించండి అభివృద్ధి చూపిస్తా అని రాజంపేట టీడీపీ అసెంబ్లీఅభ్యర్థి సుగవాసి బాల సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మంటపంపల్లె గ్రామంలో టీడీపీ నాయకులు పోలి సుబ్బారెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ముందుగా వీరికి పెద్ద ఎత్తున బాణాసంచా పేలుస్తూ భజంత్రీలు టీడీపీకి నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని, ఎంపీ అభ్యర్థి బీజేపీ పార్టీ కమలం గుర్తుకు ఓటువేసి గెలిపించానలి ఆయన ప్రతి ఎస్టీ కులాల వారు తమకు మద్దతు తెలపాలని టీడీపీ పార్టీ బడుగు బలహీన వర్గాల పార్టీ అని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లెల శ్రీవాణి, ఎద్దుల సుబ్బరాయుడు, కొమరా వెంకట నరసయ్య, సుగవాసి శ్రీనివాసులు, గజ్జల నరసింహారెడ్డి, కరెంటు రమణ, బొబ్బిలి రాయుడు, ఎంపీటీసీ సుభాన్‌బాష, మాజీ సర్పంచ్ కరీముల్లా బాష, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో సుగవాసిని గెలిపించుకుంటాం

రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను, ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని సమష్టి కృషితో అత్యధికమెజారిటీతో గెలిపించుకుంటామని రాజంపేట ఎన్నికల పరిశీలకుడు, ప్రొద్దుటూరు ఇన్‌చార్జి డాక్టర్ జి.వి.ప్రవీణ్‌కుమార్, రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, ఎన్నికల పరిశీలకుడు, కడప నియోజకవర్గ టీడీపీ నేత దుర్గాప్రసాద్, రాజంపేట నియోజకవర్గ టీడీపీ నేత పోలి సుబ్బారెడ్డి వెల్లడించారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వారు నియోజకవర్గంలో పార్టీల బలాబలాలు, ఎన్నికల ప్రచారం, ఎన్నికల్లో అనుసరిస్తున్న వ్యూహాలు, పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూగత ఐదేళ్లలో రాజంపేట నియోజకవర్గాన్ని వైసీపీ సర్వనాశనం చేసిందన్నారు. ఈ ప్రాంతం జిల్లా కాకుండా చేయడమే కాకుండా, ఇసుక దాహంతో అన్నమయ్య ప్రాజెక్టును తెంచి పలువురు ప్రాణాలు కోల్పోవడానికి, గ్రామాలు నీటమునగడానికి, మెడికల్ కళాశాల రాకపోవడానికి ఈ ప్రాంత వైసీపీ నాయకులే కారకులన్నారు. ఈ ఐదేళ్లలో రాజంపేటలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం జరగలేదన్నారు. ఇటీవల రాజంపేటకు వచ్చిన టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామని ప్రకటించడంతో నియోజకవర్గంలోని ప్రజలందరూ టీడీపీ అభ్యర్థి బాలసుబ్రమణ్యంను, బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిలను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటారని తెలిపారు.

వంద కుటుంబాలు టీడీపీలో చేరిక

రాజంపేట మండలం వరదయ్యగారిపల్లెకు చెందిన 100 కుటుంబాల వైసీపీ అభిమానులు టీడీపీ నాయకులు పాలేటి రమణయ్య, కామినేని సతీష్ ఆధ్వర్యంలో టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సతీష్ వేమన సమక్షంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా సతీష్‌వేమన మాట్లాడుతూ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ గాలి బలంగా వీస్తోందన్నారు. రాజంపేటకు తీవ్ర అన్యాయం చేసిన వైసీపీ నాయకులకు ఓటు అడిగే హక్కు లేదన్నారు. ఈ కార్యక్రమంలో భార్గవ్, శీనయ్య, శ్రీకాంత్, సుబ్బరాయుడు, కన్నయ్య, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటటౌన్: రాజంపేట నియోజకవర్గంలో టీడీపీ ప్రచారం ఊపందుకుంది. రెండు రోజులుగా పట్టణంలోని 30 వార్డుల్లో ప్రచారం చేశారు. సాయినగర్, మన్నూరు, ఆర్.ఎస్.రోడ్డు, ఉస్మాన్‌నగర్, నూనెవారిపల్లె, రామ్‌నగర్ తదితర వీధుల్లో ఆయా ప్రాంతాల నాయకులు, బూత్ కమిటీ సభ్యులు, క్లస్టర్ నాయకులు ఇంటింటికివెళ్లి టీడీపీ మేనిఫెస్టో సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేసి టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, ఎంపీ బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. మండలంలోని అన్ని గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రచారాన్ని వేగవంతం చేశారు.

సిద్దవటం: వైసీపీ అరాచక పాలనలో ప్రజలు నాయకులు ఎన్నో ఇబ్బందులు గురవడంతోనే, భారీ ఎత్తున వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరుతున్నారని టీడీపీ నాయకుడు కుప్పల వెంకటసుబ్బయ్య, జనసేన నాయకుడు అతికారి కృష్ణ, రాజంపేట టీడీపీ యువ నాయకుడు రాజానాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ తెలిపారు. సిద్దవటం మండలం నిర్మలగిరి కాలనీలో మంగళవారం సాయంత్రం 15 కుటుంబాలకు చెందిన వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ నేత కుప్పల వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీ పతనమై, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవుతారన్నారు. సైకిల్ గుర్తుకే ఓటు వేసి వేయించి తెలుగుదేశం పార్టీని, రాజంపేట అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కుమారుడు చెన్నంశెట్టి విష్ణు, టీడీపీ నాయకులు బండారు రాజగోపాల్, రాజంపేట టీడీపీ పార్లమెంటు కార్యదర్శి నాగమునిరెడ్డి, రామ్మోహన్, మల్లు వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. టీడీపీలో వారిలో బుగ్గిడివారిపల్లె పంచాయతీకి చెందిన గూడ చంద్రరెడ్డి, రాజారెడ్డి, శ్రీనివాసులు పెంచలయ్య, రామయ్య, సుబ్బయ్య తదితరులు ఉన్నారు.

సిద్దవటం: మండలంలోని పలు గ్రామాల్లో రాజంపేట నియోజకవర్గ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం ప్రచారం చేశారు. మాధవరం ఉప్పరపల్లె గ్రామాల్లో ప్రజలు, టీడీపీ కార్యకర్తలు పూలమాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దవటం మండలంలో తెలుగుదేశం పార్టీలో చేరిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు ఒక్క చాన్స్ అంటే ప్రాధేయపడిన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పేద బలహీన వర్గాలతో చెలగాటం ఆడుతున్నాడని ఆరోపించారు. చేనేత కుటుంబాలను ఆదుకుంటామని చెప్పి మోసం చేశాడన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం వచ్చాక 18 ఏళ్ల నిండిన ప్రతి ఆడపడుచుకు నెలకు 1500 రూపాయలు ఇస్తామని, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని, విద్యుత్ చార్జీలు పెంచబోమని, పేదలను అన్ని విధాలా ఆదుకుంటామని చేనేత కుటుంబాలకు ఉచిత విద్యుత్, ప్రతి గృహిణికి ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.





ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, నేతలు,
వరదయ్యగారిపల్లెలో వైసీపీ అభిమానులను తెలుగుదేశంలోకి చేర్పించుకున్న సుగవాసి బాలసుబ్రమణ్యం, సతీష్ వేమన

ఒంటిమిట్ట: రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి సుగవాసి సుబ్రమణ్యం, పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని మండల టీడీపీ ఇన్‌చార్జ్ సుగవాసి శ్రీనివాసులు కోరారు. మంగళవారం పెన్నపేరూరు గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. రాబోయే ఎన్నికల్లో సుగవాసి బాల సుబ్రమణ్యంను గెలిపిస్తే, మీ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవచ్చునన్నారు. ముంపుగ్రామమైన పెన్నపేరూరు గ్రామాన్ని టీడీపీ ప్రభుత్వం అన్ని విధాలా అభివృద్ధి చేస్తుందని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. ఉదయం గంగపేరూరు గ్రామంలో టీడీపీ మండల ఇన్‌చార్జి సుగవాసి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ అభ్యర్థి ఓటు వేసి గెలిపించాలని వారు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గజ్జల నరసింహారెడ్డి, కరెంటు రమణ, బొబ్బిలి రాయుడు, నామాల వెంకటయ్య, వీరాంజనేయరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నందలూరు: ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ పరిధిలోని అరవపల్లె, మోక్షగుండం విశ్వేశ్వరయ్య నగర్, చెరువు కట్ట, ఆర్ఎస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. రాజంపేట పార్లమెంటరీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి కమలం గుర్తుకు, సుగవాసి బాలసుబ్రమణ్యం సైకిల్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు ఎద్దుల విజయసాగర్, నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ సూర్యనారాయణ, మైనారిటీ నాయకులు సయ్యద్ అమీర్, జంగంశెట్టి సుబ్రమణ్యం, టీడీపీ నాయకులు పసుపులేటి ప్రవీన్‌కుమార్, తాటి సుబ్బరాయుడు, మహబూబ్‌బాషా, మౌలా, హెచ్‌డీ ప్రసాద్, మోడపోతుల రాము, గుండు సురేష్, నారపుశెట్టి శివయ్య, గంధం గంగాధర్, మండెం నాగేంద్ర, మురళి తదితర నాయకులు, టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

వీరబల్లి: సమగ్ర అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం మండల పరిధిలోని సోమవరం పంచాయతీలో ప్రచారం నిర్వహించారు. టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంకు ఓట్లు వేసి వేయించి ప్రజలు ఆశీర్వదించాలని పంచాయతీలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రజలను అభ్యర్థించారు. తెలుగుదేశం పార్టీని కష్టకాలంలో కాపాడిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. ఈ అరాచక వైసీపీ పాలనను త్వరలోనే ఇంటికి సాగనంపుతారని తెలియజేశారు. అనంతరం పలువురు వైసీపీ కార్యకర్తలను టీడీపీలో చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు బానుగోపాల్‌రాజు, మండల సీనియర్ నాయకులు తాటిగుట్ల శ్రీధర్‌రెడ్డి, రెడ్డప్ప రెడ్డి, వై.సురేంధర్‌రెడ్డి, కల్లూరి రామ్మోహన్‌రెడ్డి, ఆంజనేయులు రెడ్డి, జయచంద్రారెడ్డి, మచిలీ సర్పంచ్ నాగార్జున ఆచారి, నేతి ఆంజనేయులు, నాగసుబ్బయ్య నాయుడు, రాయ వెంకటేష్, రమణ, అబ్బూరి రెడ్డయ్య, అబ్బూరి నాగరాజు, భాస్కర్‌రాజు, గుదే నాగార్జున, మహిళా అధ్యక్షురాలు నాగసుబ్బమ్మ, నేతి రమేష్, ఎల్.జి.రమేష్, చాన్ బాష, బీజేపీ నాయకులు నరేంద్ర పాల్గొన్నారు.

నీటి సమస్య అధికంగా ఉంది

ఓట్లు వేయించుకుని తమ సమస్యలు తీరుస్తామని గొప్పలు చెప్పిన వైసీపీ ప్రభుత్వం, ఎమ్మెల్యే కనీసం తాగే నీటి సమస్య తీర్చలేకపోయారని, మీరైనా సమస్య తీర్చండంటూ మంగళవారం ప్రచారానికి విచ్చేసిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబును మండలంలోని సోమవరం గ్రామస్థులు కోరారు. ఎన్నికల సమయంలో వస్తారు ఓట్లు వేయించుకుంటారు, అనంతరం కనపడరంటూ, నీటి సమస్య తీర్చిన వారికే ఓట్లు వేస్తామంటూ గ్రామస్తులు ముక్తకంఠంతో తెలియజేశారు. తాగునీటి కోసం పనులు వదులుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. దీంతో ప్రసాద్‌బాబు మాట్లాడుతూ వైసీపీ పాలన అంతా నాయకులు భక్షించడానికే సరిపోయిందని, ఇలాంటి సమస్యలు ఎందుకు తీరుస్తారన్నారు. తాత్కాలికంగా సమస్య పరిష్కారానికి ఏం చేయాలని స్థానిక నాయకులను అడిగారు. ప్రస్తుతం రెండు ట్యాంకర్లతో నీరు సరఫరా చేయించాలని మండల నాయకులు శ్రీధర్ రెడ్డి, స్థానిక నాయకులు నాగసుబ్బయ్య నాయుడును ఆదేశించారు. టీడీపీ గెలిచిన తక్షణం శాశ్వతంగా తాగు నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

విద్యావంతుడు సుబ్రమణ్యంను గెలిపించండి

విద్యావంతుడు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు రామాంజులు పిలుపునిచ్చారు. మండలంలోని మట్లి, ఓదివీడు, సానిపాయి గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి వైసీపీలోని దళితులను పెద్ద ఎత్తున టీడీపీలోకి చేర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో అప్పుల పాలైపోయిన ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు చంద్రబాబునాయుడు సేవలు అవసరమన్నారు. మనసున్న మంచి మనిషి సుగవాసి బాలసుబ్రమణ్యంను అసెంబ్లీకి పంపించి రాజంపేట నియోజకవర్గ ప్రజల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు పామయ్య, ఎంఆర్‌పీఎస్ నాయకులు మాతమ్మ, సుబ్బయ్య, వెంకట్రమణ, సుబ్బయ్య, బాలాజీ, కార్యకర్తలు పాల్గొన్నారు.









రాజంపేటలో జగన్‌మోహన్‌రాజుతో కలిసి ఎన్నికల వ్యూహరచన చేస్తున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దుర్గాప్రసాద్, పోలి సుబ్బారెడ్డి, వీరబల్లిలో ప్రసాద్‌బాబును సన్మానిస్తున్న నాయకులు, అభిమానులు,
వీరబల్లిలో నీటి సమస్యలపై ప్రజలతో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు, రాజంపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

ప్రచార రథాల దహనంపై కేసు నమోదు

● ఏడుగురు వైసీపీ నాయకుల అరెస్టు ● కేసును స్వయంగా పర్యవేక్షించిన ఎస్పీ కృష్ణారావు ● వివరాలు వెల్లడించిన రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా

పీలేరు, ఏప్రిల్ 30: భారత చైతన్య యువజన పార్టీ (బీసీవైపీ) ప్రచార వాహనాల దహనం, ధ్వంసం ఘటనపై ఐపీసీ 307 కింద కేసు నమోదు చేసినట్లు రాయచోటి డీఎస్పీ సయ్యద్ మహబూబ్‌బాషా తెలిపారు. పీలేరు మండలం వేపులబైలు పంచాయతీ వరంపాటివారిపల్లె వద్ద బీసీవై పార్టీకి చెందిన రెండు ప్రచార రథాలను దహనం చేయడంతో పాటు మరో రెండు రథాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. ఈ సంఘటనపై మంగళవారం పీలేరు అర్బన్ సీఐ కార్యాలయంలో రాయచోటి డీఎస్పీ విలేకరులతో మాట్లాడారు. వేపులబైలు ఘటనలో ప్రైవేటు వ్యక్తులు ఎవరూ ఫిర్యాదు చేయలేదని, పీలేరు నియోజకవర్గ మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ) అమలు నోడల్ అధికారి, పీలేరు ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి ఎన్నికల విధుల్లో భాగంగా ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు పీలేరు అర్బన్‌స్టేషన్‌లో క్రైమ్ నెం.121/2024గా ఐపీసీ సెక్షన్లు 307, 341, 427, 435 కింద కేసు నమోదు చేశామన్నారు. ఎస్పీ కృష్ణారావు స్వయంగా కేసు నమోదు ప్రక్రియను పర్యవేక్షించారని డీఎస్పీ వెల్లడించారు. ఈ కేసులో తమకు అందిన ప్రాథమిక సమాచారం మేరకు పీలేరు మండలం కాకులారంపల్లెకు చెందిన వైసీపీ నాయకుడు కొత్తపల్లె సురేశ్ కుమార్‌రెడ్డి (కాకులారంపల్లె సర్పంచ్ హరిణి భర్త), పీలేరు పట్టణం యల్లమంద క్రాసుకు చెందిన సునీల్ కుమార్‌రెడ్డి (పీలేరు పట్టణ సచివాలయం-2 కన్వీనర్), దీపు, కరీం, మధు, వెంకటరమణ, సాయి అనే ఏడుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ సంఘటనలో మరికొంతమంది పాల్గొన్నట్లు సమాచారం ఉందని, వారందరినీ త్వరలోనే పట్టుకుంటామన్నారు. సంఘటన జరిగినప్పుడు సంఘటనా స్థలానికి సమీపంలో ఉన్న పీలేరు పట్టణానికి చెందిన ఓ మైనారిటీ వైసీపీ నేత వాహనం ఆ తరువాత కనిపించకపోవడంపై పోలీసుల ప్రమేయం ఉందని పాత్రికేయులు ప్రశ్నించగా దాని గురించి తనకు తెలియదన్నారు.



సంఘటనా స్థలానికి సమీపంలో నిలిచి ఉన్న వైసీపీ నాయకుడి వాహనం

పీలేరులో ఎస్పీ కృష్ణారావు మకాం

బీసీవై పార్టీ ప్రచార వాహనాల సంఘటన గురించి తెలుసుకున్న ఎస్పీ కృష్ణారావు సోమవారం రాత్రి 11 గంటల నుంచి మంగళవారం ఉదయం 11 గంటల వరకు పీలేరులోనే మకాం వేశారు. చిత్తూరు జిల్లా పోలీసులతో సమన్వయం చేసుకుని వేపులబైలు వద్ద జరిగిన దాడిలో పాల్గొన్న వారి కోసం పీలేరు, కలకడ, వాల్మీకిపురం పోలీసు సర్కిళ్ల పరిధిలోని కొంత మంది ఎస్ఐలను బృందాలుగా ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి 12 గంటల ప్రాంతంలో వారిలో కొంతమందిని అదుపులోకి తీసుకున్నారు. వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేసుకుని మంగళవారం ఉదయం అరెస్టు చేశారు.

వాహనం మాయం...

వేపులబైలు వద్ద బీసీవై పార్టీ ప్రచార రథాలపై దాడికి వచ్చిన వారు ఉపయోగించినట్లుగా అనుమానిస్తున్న ఓ మహీంద్రా బొలెరో వాహనం సంఘటనా స్థలం నుంచి మాయం కావడంపై టీడీపీ నేతలు మండిపడ్డారు. సంఘటనా స్థలాన్ని సోమవారం సాయంత్రం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సందర్శించారు. అక్కడ పీలేరు మైనారిటీ నేతకు చెందిన వాహనం ఉండటాన్ని గమనించి అక్కడున్న పోలీసులకు తెలిపారు. అయితే సోమవారం రాత్రి ఆ వాహనం అక్కడి నుంచి మాయం కావడంపై కిశోర్‌కుమార్‌రెడ్డి ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

అభ్యర్థులు ఎంసీసీ నిబంధనలు పాటించాలి

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్ 30: ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులందరూ కేంద్ర ఎన్నికల సంఘం నియమ నిబంధనలను పాటిస్తూ ఖర్చులకు సంబంధించిన నివేదికలను నిర్దేశిత కాలంలో తప్పనిసరిగా దాఖలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్ పోటీలో ఉండే అభ్యర్థులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ఓంప్రకాశ్‌బంపర్, వ్యయ పరిశీలకులు రవీందర్‌కుమార్, పోలీసు అబ్జర్వర్ దిల్ నవాజ్ అహ్మద్‌లతో కలిసి రాజంపేట పార్లమెంట్ పరిధిలో బరిలో నిలిచిన అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల విధి విధానాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్వేచ్ఛాయుతంగా పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించేందుకు అభ్యర్థులందరూ సహకరించాలని కోరారు. ఎన్నికల్లో అభ్యర్థులు చేస్తున్న వ్యయానికి సంబంధించి ఈ నెల 4, 8, 11వ తేదీల్లో కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి వద్ద నిర్ణీత నమూనాలో నమోదు చేసి ఎన్నికల పరిశీలకుని వద్ద తనిఖీ చేయించుకోవాలని సూచించారు.

కేజీసెట్ -2కే24కి ఏర్పాట్లు పూర్తి

● నేటి నుంచి కేజీసెట్ ప్రారంభం

సికెదిన్నె, ఏప్రిల్ 30: కేజీసెట్ 2కే24కి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీఎస్ఎస్ మూర్తి తెలిపారు. స్థానిక కేఎస్ఆర్ఎం, కేఎల్ఎం ఇంజనీరింగ్ కళాశాలలు సంయుక్తంగా మే 1 నుంచి 3వ తేది వరకు నిర్వహించే కేజీసెట్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఆన్‌లైన్‌లో పరీక్షలు రాసేందుకు అభ్యర్థుల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. ఈ పరీక్షను ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 2 గంటలకు రెండు విడుతల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాయలసీమ జిల్లాల నుంచి 5,500 మంది విద్యార్థినీ విద్యార్థులు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారని, రిజిస్ట్రేషన్ చేసుకోని వారు ఉంటే స్పాట్ రిజిస్ట్రేషన్ ద్వారా అప్పటికప్పుడే పరీక్షకు హాజరు కావచ్చని సెట్ కన్వీనర్ కిశోర్‌కుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంసెట్ తరహాలో నిర్వహించే ఈ పరీక్ష విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్రఓబుళరెడ్డి, వైస్‌ప్రిన్సిపల్ నాగేశ్వరప్రసాద్, కేఎల్ఎం ప్రిన్సిపల్ ఎంవీ రత్నమ్మ, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్, వివిధ విభాగాల అధిపతులు, తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం టీడీపీలో చేరిన కుడమలూరు వాసులు

నిన్న అలా... నేడు ఇలా..?!

రాజంపేట, ఏప్రిల్30: రాజకీయాల్లో ఎవరు ఎప్పుడు ఎక్కడ ఉంటారో ఎవరికీ అంతుచిక్కనిది. నిన్న ఒకరి ఆధ్వర్యంలో పార్టీలో చేరితో నేడు మరొకరి ఆధ్వర్యంలో మరొక పార్టీలోకి జంప్ అవుతుంటారు. పెద్దపెద్ద నేతలకే ఈ ఒంగుడు దూకుడులు తప్పడంలేదు. ఎన్నికల సమయంలో ఇలాంటి ఎన్నో వింతలు, విశేషాలు జరుగుతుంటాయి. ఈ కోవలో ఒంటిమిట్ట మండలం కుడమలూరు గ్రామంలో ఆదివారం టీడీపీ ఎన్నికల మండల ఇన్‌చార్జి సుగవాసి శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి బీసీ నేత వెంకట నరసయ్య, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు తదితర సీనియర్ నేతల ఆధ్వర్యంలో ఆ గ్రామస్తులందరూ టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి పార్టీలో సముచితస్థానం కల్పిస్తామని వారికి హామీ ఇచ్చారు. టీడీపీ అభ్యర్థి బాలసుబ్రమణ్యంను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని వారు ప్రకటించారు. ఇంతలో ఏమైందో ఏమో కానీ అదే గ్రామస్తులు వైసీపీ నేత, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథరెడ్డి సోదరుడు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వైసీపీలో చేరారు. సుమారు 300 ఓటర్లు ఉండే ఒకే సామాజిక వర్గీయులంతా రెండు రోజుల్లోనే ఇరు ప్రధాన పార్టీల్లోకి మారడం ముక్కున వేలుసుకున్నట్లైంది.





మంగళవారం వైసీపీలో చేరిన కుడమలూరు వాసులు




చిప్పిలి గుట్టపై నిర్మించిన నీటిశుద్ధి కేంద్ర సముదాయ భవనం

తండ్రి ఆశయమూ తుంగలోకే...

నాన్న నిర్మించాడు... తనయుడు వదిలేశాడు ● తుప్పుపడుతున్న ప్లాంట్లు
● పైపులైన్లు మట్టి పాలు... నిధులు నీళ్లపాలు
● మదనపల్లెలో మొదలైన నీటి సమస్య

మదనపల్లె, ఏప్రిల్ 30: 'వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుమారుడిగా, రాజకీయ వారసుడినై నాన్న ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటా, ఆయన చేపట్టిన పథకాలను కొనసాగిస్తా. వాటిని పూర్తి చేసి తండ్రీ తనయులం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి పోతామని' ప్రగల్భాలు పలికి, అధికారం చేపట్టిన జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలన పూర్తయినా వైఎస్ హయాంలో చేపట్టిన పథకాల్లో ఒక్కటీ పూర్తి చేయలేదు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలే కాదు, ఆయన చేపట్టిన ఒక్క పథకమూ ముందుకు కదల్లేదు. మళ్లీ అధికారం కోసం వెంపర్లాడుతూ ఇవే హామీలు గుప్పిస్తూ మరోసారి ప్రజలను బురిడీ కొట్టించాలని జగన్ ముందుకొస్తున్నారు. వైఎస్ వారసుడిగా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన జగన్ ఆయన చేపట్టిన పథకాలను పూర్తిచేయడంలో విఫలమయ్యారు. ఇందుకు నిదర్శనమే మదనపల్లెలోని తాగునీటి ట్రీట్‌మెంట్ ప్లాంట్లు. మదనపల్లె పట్టణ ప్రజల తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి టీడీపీ హయాంలో చంద్రబాబు నాయుడు హంద్రీ-నీవాతో పాటు రెండు సమ్మర్‌స్టోరేజీ(ఎస్ఎస్) ట్యాంకులను పూర్తి చేస్తే తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో వాటి మొరవలు కూడా పూర్తిచేయలేదు. ఎస్ఎస్ ట్యాంకుల ఆధారంగా నిల్వ చేసిన నీటిని పంపింగ్ చేసి శుద్ధి చేసి పట్టణ ప్రజలకు సరఫరా చేయడానికి ఉద్దేశించిన రెండు ట్రీట్‌మెంట్ ప్లాంట్లు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేపడితే, వాటిని పూర్తి చేయడంలో ఆయన వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన వైఎస్ జగన్ వైఫల్యం చెందారు. నాటి ఎన్నికల సమయంలో ట్రీట్‌మెంట్ ప్లాంట్లను పూర్తి చేసి వినియోగంలోకి తెస్తానని హామీ ఇచ్చినా పూర్తి చేయలేదు. దీంతో ట్రిట్ మెంట్ ప్లాంట్లు సహా వీటి నుంచి పట్టణానికి నీటిని సరఫ రా చేయడానికి ఏర్పాటు చేసిన 30 కి.మి.మేర పైపులైన్లు నిరుపయోగంగా మారా యి. ఈ క్రమంలో వీటి నిర్మాణానికి వెచ్చించిన రూ.100 కోట్లకుపైగా నిధులు మట్టిపాలవుతున్నా యి. అటు ఎస్ఎస్ ట్యాంకు మొరవ పనులు, ఇటు ట్రీట్‌మెంట్ ప్లాంటు పనులు తిరోగమనిస్తుండగా, నడకలో నత్తలతో పోటీ పడుతున్నాయి. పనులు చేపట్టి ఏళ్లు గడుస్తున్నా నేటికీ పూర్తి చేయడం లేదు. నవ్విపోదు రుగాక మాకేంటీ అన్న రీతిలో అటు హంద్రీ-నీవా అధికారులు, ఇటు ప్రజారోగ్య శాఖ అధికారులు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా కళ్లెదుటే వర్షపునీరు వృథాగా ఏటిపాలవుతుండగా, ట్రీట్‌మెంట్ ప్లాంట్లు తుప్పుపడుతున్నాయి.

మదనపల్లె మండలం చిప్పిలి, గుట్టకిందపల్లె ఎస్ఎస్ ట్యాంకుల్లోని నీటిని శుద్ధి చేసి పట్టణ ప్రజలకు సరఫరా చేయడానికి 2007లో చేపట్టిన పనులు 2011లో పూర్తయ్యాయి. వీటిని చిప్పిలి వద్ద బెంగళూరురోడ్డు పక్కన, పుంగనూరురోడ్డులోని గుట్టకిందపల్లె గుట్టలపై నిర్మించారు. రూ.40 కోట్ల హడ్కో నిధులతో వీటిని ప్రజారోగ్యశాఖ చేపట్టింది. రెండుట్రీట్‌మెంట్ ప్లాంట్లు, అక్కడి నుంచి గ్రావిటీతో పట్టణానికి నీటి సరఫరాకు రెండడుగుల వ్యాసంతో పైపులైన్, నాలుగు ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించారు. గుట్టలపై నిర్మించిన ప్లాంట్లు, సంపులతో మూడు స్టేజీల్లో నీటిని శుద్ధిచేసి, పంపేలా వ్యవస్థను ఏర్పాటు చేశారు. వీటని చేపట్టి పదేళ్లపై బడడంతో యంత్రాలు తుప్పుపట్టిపోగా, భూమిలోని పైపులైన్ పనితీరు ప్రశ్నార్థకంగా మారింది. ఇక గుట్టలపై నిర్మించిన భవనాలు వినియోగంలోకి రాకముందే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఊరికి దూరంగా ఉన్న వీటిపై పర్యవేక్షణ, నిర్వహణ లేకపోవడంతో ఆకతాయిలు తలుపులు, కిటికీలు, అందులోని పైపులు, విద్యుత్తు వ్యవస్థను ధ్వంసం చేశారు. ఇవి అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. నీటిని పంపింగ్ చేసే దశలో రెండో భాగమైన ఎస్ఎస్ ట్యాంకుల్లో ఇన్‌టేక్ వెల్ నిర్మాణం, అక్కడి నుంచి గుట్టలపైన గల ప్లాంట్లుకు నీటిని సరఫరా చేసే పైపులైన్ ఏర్పాటు చేయాల్సివుంది. వీటికోసం 2019లో హడ్కో రూ.4.50కోట్లతో టెండర్లు పిలిచింది. ఈక్రమంలో చిప్పిలి ఎస్ఎస్ ట్యాంకులో నిర్మాణం పూర్తికాగా, గుట్టకిందపల్లె ట్యాంకులో వెల్ నిర్మాణం పునాది దశకే పరిమితమైంది. ఈ రెండు ట్యాంకుల నుంచి పట్టణానికి నీటిని సరఫరా చేసే వ్యవస్థలో భాగంగా వివిధ స్థాయిల్లో 30 కి.మి.పైపులైన్ మట్టిలో కలసిపోతోంది. అధికారుల నిర్లక్ష్యం, పాలకుల పర్యవేక్షణ కొరవడడంతో ప్రజాధనం వృథా కావడమే కాదు, ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయి దిష్టి బొమ్మలుగా దర్శనమిస్తున్నాయి. వీటిని పూర్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అమృత్ పథకం-2లో రూ.30కోట్లు మంజూరు చేసినా క్షేత్రస్థాయిలో అమలు కాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి.



నిరుపయోగంగా మారిన నీటిశుద్ధి వ్యవస్థ



తుప్పుపడుతున్న నీటిశుద్ధి ప్లాంటు

జగన్ పాలనలో ప్రైవేటు మయం

● చూపంతా అద్దె బస్సుల పైనే
● విలీనమైనా కానరాని పురోగతి
● ఇదీ ఆర్టీసీ పై జగన్మాయ

కడప (మారుతీనగర్) ఏప్రిల్ 30: ఆర్టీసీ అంటేనే ప్రగతి రథచక్రాలు లోగోతో కళకళలాడేది. అయితే జగన్ పాలనలో ప్రగతి రథచక్రాలు తిరోగమనం చెందాయి. ఆర్టీసీని ప్రైవేటు పరం చేయాలనే తలంపుతోనే ప్రభుత్వంలోకి విలీనం చేశారని జగన్ పై ఇప్పటికీ కార్మిక సంఘాలు గుర్రుమని ఉన్నాయి. ఎంతో ఖ్యాతి గాంచి సురక్షిత ప్రయాణానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన ఆర్టీసీకి గిన్నిస్ బుక్‌లో చోటు దక్కిందంటే అతిశయోక్తి కాదు. నిత్యం లక్షలాది మంది ప్రయాణీకులను గమ్యస్థానానికి చేర్చడంలో ఉద్యోగులు, కార్మికుల కృషి ఎనలేనిదని ఎండా, వానా, చలి, పగలూ, రాత్రి అనే తేడా లేకుండా వారందించే సేవలను ప్రతి ఒక్కరూ కొనియాడుతుంటారు. ఇంత ఖ్యాతిగాంచిన సంస్థ జగన్ పాలనలో తిరోగమనంలోకి నెట్టివేయబడిందన్న ఆరోపణలున్నాయి. ఏదేమైనా జగన్‌రెడ్డి పాలనలో చెప్పే దానికి చేసేదానికి పొం తనే వుండదు. మాటలతో కోటలు కట్టడంలో పావలా యాక్షన్‌కు వంద రూపాయల నటన చేయడంలో అందరినీ మించి పోయారు. ఏదేని బస్సు 10 లక్షల కిలోమీటర్లు తిరిగితే కాలం చెల్లిన బస్సుగా సంస్థ పరిగణించేది. కాలగ మనంలో 2020 జనవరి 1న సీఎం జగన్ ఆర్టీసీని ప్రభుత్వంలోకి విలీనం చేశారు. అప్పటి నుంచే ఆర్టీసీ కార్మికులు ఉద్యోగులుగా మారారే తప్ప వారికి ఇతర ప్రభుత్వ ఉద్యోగుల్లా అందే సదుపాయాలు అందని ద్రాక్షలా తయారైంది. దీంతో ఆర్టీసీ ఉద్యోగులు తీవ్ర నిరాశలో సేవలందిస్తూ వైసీపీ సర్కార్‌పై తీవ్ర వ్యతిరేక భావంతో వున్నట్లు తెలిసింది. 10 లక్షల కిలోమీటర్లు తిరిగిన బస్సులను కాలం చెల్లినవిగా గుర్తించే విధానాన్ని జగన్ ప్రభుత్వం వాటి కాల పరిమితిని 14 లక్షలకు కిలోమీటర్లకు పొడిగించినట్లు తెలిసింది. అంతటితో ఆగకుండా కాలం చెల్లిన బస్సులకు ఇంజన్, బాడీని మార్చి మసి పూసి మారేడు కాయను చేసినట్లుగా పాత బస్సులకు రంగులద్ది కొత్తవిగా చిత్రీకరించడం పరిపాటిగా మారింది. పైపెచ్చు కొత్త బస్సుల కొనుగోలుకు తిలోదకాలిచ్చి సుమారు 10వేల పైచిలుకు అద్దె బస్సులను తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆ లెక్కన కేవలం 600 కొత్త బస్సులను మాత్రమే ఆర్టీసీ తరపున కొనుగోలు చేసినట్లు సమాచారం. విలీనం తర్వాత ఆర్టీసీని ప్రైవేటు పరం చేయాలనే ధ్యాస తప్ప సంస్థను పురోగతి బాట పట్టించాలనే ఆలోచన వైసీపీ సర్కార్‌కు లేదనేది నగ్నసత్యం. ఇదిలావుండగా ఆర్టీసీ సంస్థ ద్వారా ఒక బస్సు కొనుగోలు చేస్తే ఆ బస్సు వలన ఏడుగురికి ఉద్యోగాలు లభించేవి. (ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు కండక్టర్లు, ఇద్దరు మెకానిక్‌లు, ఒక అప్రెం టీస్) దీంతో నిరుద్యోగ సమస్య కొంత మేర కైనా తీరగలిగేది. జగన్ పాలనలో అద్దె బస్సులకు ప్రాధాన్యత ఇస్తుండడంతో ఆయా అద్దె బస్సుల ఓనర్లు మాత్రమే లాభ పడుతున్నారనే ఆరోపణలున్నాయి. అద్దె బస్సుల వలన (ఒక డ్రైవర్, ఒక క్లీనర్) నామ మాత్రపు ఉద్యోగులుగా (రెస్పాన్స్‌బిలిటీ) సేవలందిస్తున్నారు. ఏది ఏమైనా ఆర్టీసీని పూర్తిగా ప్రైవేటు బస్సులతో నింపేలా జగన్ సర్కార్ పావులు కదుపుతోంది. పేరుకే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేసిందే తప్ప చూపంతా అద్దె బస్సుల సంఖ్యను అమాంతం పెంచడంపైనే శ్రద్ధ కనబరుస్తోందనే విమర్శలున్నాయి.





విలీనమైనా కానరాని పురోగతి

అర్టీసీని ప్రభుత్వంలోకి విలీనం చేసి అందులో పనిచేసే కార్మికుల బతుకులను మారుస్తామని గత ఎన్నికల ముందు జగన్‌రెడ్డి చిలక పలుకులను నమ్మిన కార్మికుల ఏక పక్షంగా ఓట్లు వేసి వైసీ పీని గెలిపించారు. వారి కిచ్చిన హామీ మేరకు విలీనమైతే చేశారే గానీ గతంలో కార్మికుల కు అందే పలు రకాల సదుపాయాలకు మంగళం పలికారు. వచ్చే పదేళ్లలో ఆర్టీసీలో సగం బస్సులు అద్దె బస్సులున్నా ఆశ్చర్యపోవాల్సిన పరిస్థితి లేదు. ఇప్పటికే ఆర్టీసీలో కాలం చెల్లిన బస్సుల సంఖ్య సుమారు 4వేలకు పైగా వుండగా ఆ లెక్కన 10లక్షల కిలోమీటర్లు తిరిగిన బస్సుల సంఖ్య 6వేలకు పైగా వున్నట్లు సమాచారం.

కడప రీజియన్ పరిధిలో (కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేల్) 2019లో ఆర్టీసీ తీరు ఇలా ఉంది.

● కడప రీజనల్ పరిధి డిపోల ద్వారా 589 సంస్థ బస్సులుండగా అద్దె బస్సుల సంఖ్య 213, అప్పట్లో రోజువారీ 2.27 లక్షల కిలోమీటర్లు తిరిగేవి. దీంతో రోజువారి ఆదాయంగా 79.50 లక్షల ఆదాయం సమకూరేది.

● ఆ లెక్కన 2024 ఏప్రిల్ నాటికి ఆర్టీసీ బస్సుల సంఖ్య 333 వుండగా అద్దె బస్సుల సంఖ్య 214గా వుంది. ఆ లెక్కన రోజుకు 2.18 కిలోమీటర్లు తిరుగుతుండగా ఆదాయంగా రోజుకు 95.77 లక్షల రూపాయలు సమకూరుతున్నట్లు తెలిసింది.

బావ చెబితే సరే...

అబ్బ.. బంగారు రెడ్డే... !

● వైసీపీ నేతే ఫార్‌వర్డ్ బ్లాక్ అభ్యర్థి
● ఎమ్మెల్యే బరిలో బావకు పోటీగా బామ్మర్ది






నామినేషన్ వేస్తున్న పి.మునిరెడ్డి బంగారు

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 30: ప్రొద్దుటూరు ఎమ్మెల్యే ఫార్‌వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న ఇతను ఎవరో కాదు వైసీపీ నేత, ప్రొద్దుటూరు రెండో ఎమ్మెల్యేగా పేరొందిన మున్సిపల్ రెండో వైస్‌చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి అలియాస్ బంగారు రెడ్డి. బావ కళ్లల్లో ఆనందం చూడాలనుకునే మొదటి వ్యక్తి. బావ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి కృష్ణుడైతే బావ మరిది బంగారురెడ్డి అర్జునుడు. ఇది ప్రొద్దుటూరు ప్రజలందరికీ తెలిసిన సత్యం. కానీ పాత కోట బంగారు మునిరెడ్డి అలియాస్ బంగారురెడ్డి ప్రొద్దుటూరు ఎమ్మెల్యే బరిలో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరపున నామినేషన్ వేశారు. నిన్నటి వరకు ఆయన వైసీపీ తరపున బావ రాచమల్లు ప్రసాద్‌రెడ్డికి ప్రచారం చేశాడు. నామినేషన్లు ముగిసి ఉపసంహరణ ప్రక్రియ పూర్తవడం, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరపున అభ్యర్థిగా ఖరారవడంతో ఆయనకు సింహం గుర్తు కేటాయించారు. అధికార వైసీపీలో మున్సిపల్ వైస్ చైర్మన్‌గా వుండి ఆయన మరో పార్టీకి పోటీ చేయడంపై ప్రొద్దుటూరు ప్రజల్లో ఆసక్తిదాయకమైన చర్చజరుతోంది. రేపటినుంచి ఆయన సింహం గుర్తుపై ప్రచారం చేస్తాడా లేదా వైసీపీ ఫ్యాను గుర్తుకు ఓటేయమని అడుగుతాడా అని చర్చ సాగుతోంది. అయితే ఏజెంట్లకు, ఎన్నికల అకౌంట్, వాహనాల సంఖ్యకు, బావకు సహకరించే అవకాశం ఉందని ఎన్నికల విశ్లేషకులు భావిస్తున్నారు. బంగారు రెడ్డి నామినేషన్ వేయడంలో ఇదే మతలబని చర్చనీయాంశమైంది.

ష్...పనిచేయలా..

ఆత్మీయ సమావేశాల్లో ఎదురవుతున్న ప్రశ్నావళి

తలలు పట్టుకుంటున్న నేతలు ● ఇంటికెళ్లి బుజ్జగింపులు



కడప, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): 'అంతా మనదే పైచేయి ఉండాలి. ఎవరూ ప్రశ్నించకూడదు, ప్రశ్నించే వారిని డబ్బుతో కొందాం. ఆయా వర్గాల్లోని ఓ నేతకు తాయిళాలు ప్రకటిద్దాం. కిందిస్థాయి నేతలు, ప్రజలకు మందు, విందు ఏర్పాటు చేద్దాం. మనం ఏం చెబితే అదే జరిగేలా ఏర్పాటు చేద్దాం. ప్రజలు మరోపార్టీలో చేరకుండా చూద్దాం. ఇందుకు ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేద్దాం. మన మీడియాను తప్ప మిగిలిన వారు ఎవరినీ రానివ్వద్దు'. ఇదీ పులివెందులలో వైసీపీ సాగిస్తున్న రాజకీయం. వారు అనుకున్నట్లుగానే సమావేశాలు ఏర్పాటు చేశారు. ఎంత పకడ్బందీగా సమావేశాలు ఏర్పాటు చేసినా ఆయా వర్గాల్లోని కొందరు ప్రజలు మాకేం చేశారంటూ నేతలను ప్రశ్నిస్తున్నారు. కొందరినే అందలం ఎక్కించి మిగిలిన వారిని వదిలేస్తున్నారు. పార్టీ కోసం క్షేత్రస్థాయిలో ఉంటూ వివరాలు సేకరిస్తూ ఎంతో సేవ చేశాం. అయినా మమ్మల్ని చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. కనీసం మా ఏరియాకు ట్యాంకర్ నీళ్లు కూడా తెప్పించుకోలేకపోతున్నాం. సమస్య పరిష్కారం కోసం వచ్చేవారికి ఏమీచేయలేకపోతున్నాం. దీంతో మా బలం కూడా చేజారిపోయింది. నమ్ముకున్న వారికి ఉద్యోగాలు ఇప్పించుకోలేకపోయాం. ప్రచారంలో కొందరు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది టీడీపీ వైపు చూస్తున్నా వారిని ఆపలేకపోతున్నాం. ఎన్నికలు వచ్చాయని ఇలా సమావేశాలు ఏర్పాటుచేసి మీకు అదిచేస్తాం, ఇది చేస్తాం అంటున్నారు, ముందు తమకు ఏం చేశారో చెప్పాలని సమావేశాల్లో బడానేతలను ప్రశ్నించారు. వారు అడిగే ప్రశ్నలకు పెద్ద నేతలు తలలు పట్టుకుంటున్నారు. దీంతో ఇంటింటికీ వెళ్లి బుజ్జగిస్తున్నారు. నేత స్థాయిని బట్టి లక్ష నుంచి ఐదు లక్షల రూపాయలు పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. ఎన్నికలు పూర్తికాగానే మీరు అడిగింది తప్పకుండా నెరవేరుస్తామంటూ హామీలిస్తున్నట్లు సమాచారం. ఇంటి స్థలం కావాలా, డబ్బు కావాలో చెప్పండి అంటూ మరికొందరికి ఎరవేస్తున్నారు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ప్రశ్నిస్తున్నారని ఆయా వర్గాల నేతలకు క్లాస్ తీసుకుంటున్నట్లు సమాచారం.

ఇవి కన్పించలేదా...?



ఇళ్లకు ఉన్న స్టిక్కర్లు

ముద్దనూరు ఏప్రిల్30: ముద్దనూరులో ఎన్నికల కోడ్ అధికారులకు పట్టనట్లుంది. ఎక్కడే గానీ పార్టీ గుర్తులు, పేర్లు, రంగులు, జెండాలు ఉండకూడదన్న ఎన్నికల నిబంధనలున్నాయి. ముద్దనూరు టౌన్ జెండామాను వీధి, రైల్వే గేట్ల సమీప ఇళ్లు, హౌసింగ్ కార్యాలయం సమీపంలోని వీధిలో ఇళ్లకు అతికించిన జగన్ బొమ్మతో కూడిన మానమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు కన్పిస్తున్నాయి. ఎన్నికల కోడ్ అమలై దాదాపు నెల రోజులు కావస్తున్నా అధికారులకు అవి కన్పించలేదా అన్న విమర్శలు వస్తున్నాయి.

నీడ దొరికేతే చాలు.. పరుగో పరుగు...



సిరివరంలో చెట్టు నీడకు చేరిన కార్యకర్తలు

పెనగలూరు, ఏప్రిల్ 30: ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కార్యకర్తలు, పౌరులు, ప్రజలు సైతం చెట్టు కనిపిస్తే పరుగో పరుగని చెట్టు కిందికి వాలిపోతున్నారు. ఉదయం నుంచి ఎండ మాడు పగిలేలా మండిపోతుండడంతో నేతలు ఓటర్లు ఎండ వేడిమిని భరించేలేకపోతు న్నారు. ఓవైపు కాలే ఎండ మరో వైపు కారే చెమట, తీవ్రమైన దాహం ప్రజలను బేంబేలేతిస్తున్నాయి.

ఓటింగ్‌శాతం పెంచాలి : ఆర్ఓ



సెక్టోరియల్ అధికారులకు సూచనలిస్తున్న ఆర్ఓ

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 30: ఓటుహక్కు వున్న ప్రతి ఒక్కరూ ఓటు వేసి ఓటింగ్ శాతం పెంచాలని మదనపల్లె నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి హరిప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో సెక్టోరియల్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో వున్న వృద్ధులు, దివ్యాంగులు పోలింగ్ కేంద్రాని కి రాలేని పక్షంలో వీరికి ఇంటి నుంచే ఓటు వేసే విధా నంపై ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఇందులో 85 ఏళ్ల వయస్సు పైబడిన వారు, 40 శాతం పైగా వైకల్యం వున్నవారు ఇంటి నుంచే (హోమ్ ఓటింగ్ విధానం) ఓటు వేయొచ్చన్నారు. తొలిసారిగా పార్లమెంట్ ఎన్నికల్లో ఈ విధానం ప్రవేశపెడుతున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు తెలంగాణలో ఈ విధానం ప్రవేశపెట్టారన్నారు. మదనపల్లె నియోజవర్గంలో 85 ఏళ్లు దాటిన 21 మంది, 31 మంది దివ్యాంగ ఓటర్లను గుర్తించామన్నారు. వీరి చిరునామాలు సేకరించామని, హోమ్ ఓటింగ్ విధానంలో పోలింగ్ అధికారి, సహాయ పోలింగ్ అధికారి, మైక్రో అబ్జర్వర్, బీఎల్ఓ కలిసి ఇంటికి వెళ్లి బ్యాలెట్ పేపర్ తీసుకెళ్లి గోప్యత పాటిస్తూ వృద్ధులు, దివ్యాంగుల ఓట్లు పోలింగ్ చేయిస్తామన్నారు. జిల్లా ఎన్నికల అధికారి ఉత్తర్వుల మేరకు షెడ్యూల్ ప్రకారం హోమ్ ఓటింగ్ విధానం అమలు చేస్తామన్నారు.

ఫోటోను చూసి ఓటేయవచ్చు

మైదుకూరు, ఏప్రిల్ 30: ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు సంస్కరణలకు ప్రాధాన్యం ఇస్తోంది. పారదర్శక పోలింగ్‌కు అవసరమైన చేర్పులు, మార్పులు తీసుకువస్తోంది. ఇందులో భాగంగా ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో సైతం ప్రత్యేకతలు తీసుకుంది. ప్రజలు ఏవరికి ఓటు వేశామనేదీ తెలుసుకునేందుకు వీవీ ప్యాట్‌లు వినియోగించనుండడం, దివ్యాంగులు పోలింగ్ కేంద్రాలకు చేరుకునేలా ప్రత్యేక వాహన సదుపాయం, అభ్యర్థి ఫొటో చూసి ఓటు వేసే అవకాశం కల్పించింది. ఈవీఎంలో అభ్యర్థి పేరు, గుర్తు సహా ఫొటో ఉంటుంది. నోటా వద్ద మాత్రం ఫొటో స్థానం ఖాళీగా ఉంటుంది.

'పోలింగ్ ప్రక్రియలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర అత్యంత కీలకం'



శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అబ్జర్వర్స్, కలెక్టర్

రాయచోటిటౌన్, ఏప్రిల్30: పోలింగ్ ప్రక్రియలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర అత్యంత కీలకమైనదని అన్నమయ్య జిల్లా ఎన్నికల అబ్జర్వర్స్ ఓంప్రకాశ్ బంకర్, మన్నికేరి కవిత, వైభవ్‌శుక్ల సూచించారు. మంగళవారం స్థానిక సుధా కన్వెన్షన్ హాల్‌లో మైక్రో అబ్జర్వర్లకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ అధ్యక్షతన నిర్వహించిన శిక్షణలో వారు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ సూచనలను మైక్రో అబ్జర్వర్‌లు తప్పనిసరిగా పాటించాలన్నారు. వారికి కేటాయించిన విధులు, బాధ్యతల పట్ల పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏం చేయాలనే అంశంపై ఇప్పటి నుంచే స్పష్టత ఉండాలన్నారు. మైక్రో అబ్జర్వర్‌లకు శిక్షణ అత్యంత ముఖ్యమైనదని, ఎన్నికల్లో అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్లు అప్రమత్తంగా ఉండి అభ్యర్థులు ఖర్చు చేసే డబ్బు మొత్తం వివరాలు ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లలో నమోదు చేయాలన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్లు అంకిత భావంతో పనిచేసి సజావుగా విధులు నిర్వహించాలన్నారు. జిల్లాలో 1609 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేశామన్నారు. మైక్రో అబ్జర్వర్లకు అవసరమైన సహాయ సహకారాలు జిల్లా యంత్రాంగం అందిస్తుందని, అబ్జర్వ ర్లకు కేటాయించిన బాధ్యతలను నమ్మకంతో చేయాలని, సందేహా లు, సమస్యలుంటే వెంటనే తెలియజేసి పరిష్కరించుకోవాల న్నారు. కార్యక్రమంలో జిల్లాలోని మైక్రో అబ్జర్వర్లు పాల్గొన్నారు.



నగరిలో ఇద్దరు రోజాలు

ఇదీ మందు

నగరి ఎమ్మెల్యే అభ్యర్థిగా వైసీపీ తరపున రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా పోటీ చేస్తుండగా ఇండిపెండెంట్‌గా అదే పేరుతో మరో అభ్యర్థిని కే. రోజా బరిలోకి వచ్చింది. నామినేషన్ల ఘట్టం పూర్తి కావడంతో తిరుపతి రూరల్ పుదిపట్లకు చెందిన కే.రోజా అనే మహిళా అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించిన లిస్ట్‌లో ఉంది. దీంతో వైసీపీ వర్గాల్లో అయోమయం నెలకొంది. ఈమెకు కుట్టుమిషన్ గుర్తును ఎన్నికల సంఘం కేటాయించింది. పేరుతో ఒకే రకంగా ఉండడంతో వారు తలలు పట్టుకుంటున్నారు. మరోవైపు టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేరు సరిపోలే విధంగా వైసీపీ నాయకులు భానుప్రకాష్ పేరున్న మరో వ్యక్తితో నామినేషన్ దాఖలు చేయించారు. అది స్క్రూటినీలో తిరస్కారానికి గురికావడంతో వారి ప్లాన్ బెడిసికొట్టింది. అలాగే జ్ఞానప్రకాష్ పేరుతో మరో నామినేషన్ కూడా వేయించారు. ఇది సక్రమంగా ఉండడంతో ఆ అభ్యర్థి ఎన్నికల బరిలో నిలిచారు. టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్‌కు ఒకటో నెంబర్ కేటాయించగా జ్ఞాన ప్రకాష్‌కు నాలుగవ నెంబర్ రావడంతో వైసీపీ పాచిక పారలేదనే ప్రచారం జరుగుతోంది. పేర్లతో ఓటర్లను తికమకకు గురిచేయాలనే వైసీపీ ప్రయత్నాలు ఫలించలేదు.

- పుత్తూరు అర్బన్

వైసీపీలో గాజు గ్లాసు ఆశ

అనుకున్నట్లే అయింది. కుప్పంలోనూ స్వతంత్ర అభ్యర్థికి జనసేన పార్టీ గుర్తు అయిన గాజు గ్లాసు సింబల్ కేటాయింపు జరిగిపోయింది. ఎన్నికల నిబంధనల ప్రకారం ఇది సరియైనదే అయినా నైతికంగా మాత్రం తప్పుడు చర్య అని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. వైసీపీ రెబల్‌గా మారి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్న మొరసనపల్లె అధికార పార్టీ సర్పంచి జగదీశ్ భార్య నీలమ్మకు ఈ గాజు గ్లాసు గుర్తు కేటాయించారు. ఇప్పుడీ గాజు గ్లాసుపైన వైసీపీ 'దింపుడుకళ్లం ఆశ'లు పెట్టుకుంటోంది. 'వైనాట్ కుప్పం' అని వైసీపీ అధినేత జగన్ చెప్పాక.. కుప్పంలో చాలా పరిణామాలు చోటు చేసుకున్నాయి. క్షేత్రస్థాయిలో అధికార పార్టీ గ్రామ స్థాయి నాయకులు సహాయ నిరాకరణ మూడ్‌లోకి వెళ్లిపోయారు. దీంతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుజ్జగింపులు.. ఈ మధ్య జరిగిన ఒక సమావేశంలో ప్రజాప్రతినిధులపై భరత్ తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తం చేయడం వంటి పరిణామాలు ఆ పార్టీ రాబట్టగలిగే ఓట్లెంతో ఒక అంచనాకు వచ్చేశారు అందరూ. కనీసం గౌరవప్రదమైన ఓట్లతో బయటపడితే చాలన్న ఆలోచన పార్టీలో మొదలైపోయిందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మొదలైన 'గాజు గ్లాసు' ఆలోచనలు చివరకు వైసీపీ రెబల్ అయిన స్వతంత్ర అభ్యర్థి నీలమ్మకు ఆ గుర్తు కేటాయింపు జరిగింది. ఎంతోకొంత నీలమ్మ చీల్చగలిగిన ఓట్లను వైసీపీవి కాక టీడీపీవి అయ్యేలా గట్టి ప్రయత్నాలే సాగుతున్నాయి. కూటమి పార్టీలలో ఒకటైన జనసేన గుర్తు కాబట్టి, సైకిల్‌పై పడాల్సిన ఓట్లు గాజు గ్లాసుపై పడాలని వైసీపీ నాయకులు కోరుకుంటున్నారు. కానీ టీడీపీ అధినేత చంద్రబాబే అభ్యర్థిగా ఉన్న కుప్పంలో వైసీపీ ఆటలు చెల్లేలా మాత్రం కనిపించడంలేదు. ఇక, నగరి అసెంబ్లీ, చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గంలోనూ స్వతంత్ర అభ్యర్థులకు 'గాజు గ్లాసు' గుర్తు కేటాయించారు. ఇదంతా ప్లాన్ ప్రకారం జరిగిందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

- కుప్పం



రాజంపేట లోక్‌సభ బరిలో పెద్దిరెడ్డి, నల్లారి కుటుంబాలు



వాళ్లు.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మూడు దశాబ్దాలుగా రాజకీయ బద్ధ శత్రువులు. పదేళ్ల ముందర వరకు కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నప్పటికీ ప్రత్యర్థులే. పక్క నియోజకవర్గాలైనా.. రాజకీయ వైరం కొనసాగింది. అలాంటి నల్లారి.. పెద్దిరెడ్డి కుటుంబాలు ఈ ఎన్నికల్లో తొలిసారి తలపడుతున్నాయి. రాజంపేట లోక్‌సభ బీజేపీ కూటమి నుంచి మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, వైసీపీ తరపున పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి బరిలో ఉన్నారు. పరస్పర తీవ్ర విమర్శలతో రాజకీయాలూ హీటెక్కుతున్నాయి.

పాత ప్రత్యర్థుల తొలి ఫైట్

తొలిసారి నేరుగా పోటీ

నాడు ఒకే పార్టీలో ప్రత్యర్థి కుటుంబాలు. నేడు వేర్వేరు పార్టీల అభ్యర్థులుగా రాజంపేట లోక్‌సభకు పోటీపడుతున్నారు. ఎంపీ స్థానానికి కిరణ్ తొలిసారిగా.. మిథున్‌రెడ్డి మూడోసారి బరిలోకి దిగారు. జగన్‌ను 16 నెలలు జైలులో పెట్టారని, సీఎంగా ఆయన అభివృద్ధి చేయలేదంటూ పెద్దిరెడ్డి వ్యక్తిగతంగా దూషిస్తూ ప్రచారం సాగిస్తున్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డి కూడా ప్రచారంలో దీటుగా ముందుకు సాగుతున్నారు. ఈయన తరపున ఇప్పటికే చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రచారంలో పాల్గొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కూడా ప్రచారానికి రానున్నారు.

- పుంగనూరు

ఉమ్మడి చిత్తూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఉన్నప్పటి నుంచీ ఆయనకు, నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి మధ్య రాజకీయ ఆధిపత్య పోరు కొనసాగుతోంది. ఒకే పార్టీలో ఉన్నా వీరిమధ్య సయోధ్య కుదరలేదు. కలికిరిలో కిరణ్‌కుమారెడ్డి చిన్నాన్న నల్లారి తిమ్మారెడ్డి మిషన్ వద్ద సారా నిల్వ విషయంగా పెద్దిరెడ్డి సోదరుడు భాస్కర్‌రెడ్డి గొడవ చేయడంతో వివాదాలు మరింత పెరిగాయి. పూర్వపు వాయల్పాడు నియోజకవర్గం కలికిరి మండలం మేడికుర్తి ప్రాజెక్టు నిర్మాణ టెండర్ పెద్దిరెడ్డి వేయరాదని నల్లారి కిరణ్ ప్రయత్నించగా.. చివరి నిమిషంలో పీఎల్ఆర్ కంపెనీ టెండర్ వేసి పని దక్కించుకుంది. గతంలో తన అనుచరుడైన సుధాకర్ గౌడ్ భార్య, గుర్రంకొండ జడ్పీటీసీ సభ్యురాలు మంజులను జడ్పీ ఛైర్‌పర్సన్ చేయాలని కిరణ్ భావించగా.. బైరెడ్డిపల్లె జడ్పీటీసీ సభ్యురాలు ఎం.రెడ్డెమ్మకు ఆ పదవి ఇవ్వాలని పెద్దిరెడ్డి పట్టుపట్టారు. నాటి పీసీసీ అధ్యక్షుడు సత్యనారాయణరావు పంచాయితీ చేసి చివరకు రెడ్డెమ్మకు పదవి ఇచ్చారు. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి రాగా.. కిరణ్‌కుమార్‌రెడ్డికి మంత్రి పదవి దక్కుతుందని అందరూ భావించారు. కానీ, మంత్రి పదవి రాకుండా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తీవ్రంగా అడ్డుకున్నట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. దీంతో కిరణ్‌కు ప్రభుత్వ చీఫ్‌విప్ పదవి వరించింది. 2009లోనూ కిరణ్‌కు మంత్రి పదవి రాకుండా అడ్డుపడి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంత్రి అయ్యారు. కిరణ్‌కు అసెంబ్లీ స్పీకర్ పదవి దక్కింది. వైఎస్ మృతితో రోశయ్య తర్వాత సీఎం అవకాశం కిరణ్‌కుమార్‌రెడ్డికి వచ్చింది. వైఎస్ క్యాబినెట్‌లోని పెద్దిరెడ్డి తప్ప మిగిలిన అందరినీ ఆయన మంత్రులుగా కొనసాగించారు. ఇలా రెండు కుటుంబాలు, వర్గాల మధ్య కొనసాగిన రాజకీయ కక్షలు, విభేదాలు తీవ్రస్థాయికి చేరాయి. గతంలో పీలేరు నియోజకవర్గంలో కిరణ్‌కు వ్యతిరేకంగా పెద్దిరెడ్డి వర్గం.. పుంగనూరులో పెద్దిరెడ్డికి వ్యతిరేకంగా నల్లారి వర్గం ఎన్నికల్లో పనిచేశాయి. ఒకే పార్టీలో ఉన్నప్పటికీ రాజకీయ ఆధిపత్య పోరు కొనసాగింది.

రెండు కుటుంబాల రాజకీయ నేపథ్యం

- కలికిరి మండలం నగరిపల్లెకి చెందిన మాజీ మంత్రి నల్లారి అమరనాథరెడ్డి మృతితో ఆయన భార్య సరోజమ్మ పోటీ చేసి ఓటమి చెందారు. ఆ తర్వాత ఎన్నికల్లో కిరణ్‌కుమార్‌రెడ్డి 1989 నుంచి 2009 వరకు వాయల్పాడు, నియోజకవర్గ పునర్విభజనలో పీలేరు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందారు. ప్రభుత్వ చీఫ్ విప్, స్పీకర్, ముఖ్యమంత్రిగా పనిచేశారు. రాష్ట్ర విభజనతో కాంగ్రెస్‌ను వీడి జైసమైక్యాంధ్ర పార్టీ పెట్టారు. ఆ ఎన్నికల్లో ఆయన పోటీ చేయలేదు. కొంతకాలం తర్వాత కాంగ్రెస్‌లో... అనంతరం బీజేపీలో చేరారు. ప్రస్తుతం రాజంపేట ఎంపీ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు.
- సదుం మండలం ఎర్రాతివారిపల్లెకు చెందిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాంగ్రెస్ నుంచి 1989లో పీలేరు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇలా కిరణ్, పెద్దిరెడ్డి ఒకేసారి ఎమ్మెల్యేలు అయ్యారు. నియోజకవర్గ పునర్విభజనతో పీలేరు నుంచి పుంగనూరుకు వచ్చి ఒకసారి కాంగ్రెస్, రెండుమార్లు వైసీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య క్యాబినెట్‌లో కొంతకాలం.. ప్రస్తుతం జగన్ మంత్రి వర్గంలోనూ ఉన్నారు. ఈయన కుమారుడు మిథున్‌రెడ్డి 2014, 2019 ఎన్నికల్లో వైసీపీ తరపున రాజంపేట లోక్‌సభకు పోటీచేసి గెలుపొందారు.

పరస్పరం 'కాళ్ల బేరాల' ఆరోపణలు

- అడ్డదారిలో సీఎం కావడానికి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి నాటి కేంద్రమంత్రి చిదంబరం కాళ్లుపట్టుకున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పలుమార్లు ఆరోపణలు చేశారు.
- గతంలో డీసీసీ అధ్యక్ష పదవికి అడ్డుపడకుండా మద్దతు ఇవ్వాలని తిరుపతిలో రాత్రి ఒక్కసారి, మరుసటి రోజు ఉదయం మరోసారి పెద్దిరెడ్డి తన కాళ్ల పట్టుకున్నారని కిరణ్‌కుమార్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఇది నిజమని.. తాను కాణిపాకం, తరిగొండలో ప్రమాణం చేయడానికి సిద్ధమని సవాల్ విసిరారు. తన తండ్రికాలం నుంచి వ్యక్తిత్వాన్ని విడవలేదని, తాను ఎవరి కాళ్ల పట్టుకోలేదని స్పష్టంచేశారు.
- 'సత్యసాయిబాబా మృతితో టన్నులు టన్నుల బంగారాన్ని లారీల్లో తరలించి చిదంబరం, కిరణ్‌కుమార్‌రెడ్డి దోచుకున్నారని పెద్దిరెడ్డి చేసిన ఆరోపణలు నిరాధారం. అయ్యప్పస్వామి గుడిలో ఆయన ప్రమాణం చేయాలి' అంటూ కిరణ్ మరోసారి సవాల్ విసిరారు.
- తాను సోనియాగాంధీ కాళ్లే పట్టుకోలేదని, కిరణ్ కాళ్లు పట్టుకోవాల్సిన దుర్గతి పట్టలేదని, మిథున్ చేతిలో ఓడిపోవడం ఖాయమని ఎన్నికల ప్రచారాల్లో పెద్దిరెడ్డి చెబుతున్నారు.

- ఇలా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మళ్లీ రాజకీయాల్లోకి వచ్చి పెద్దిరెడ్డిపై తీవ్రవిమర్శలు చేయడం, కాళ్లు పట్టుకున్నారన్న ఆరోపణలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి.

- కిరణ్ గెలిస్తే కేంద్ర మంత్రి అవుతారని, రాజంపేట పార్లమెంటు అభివృద్ధి చెందుతుందని, పెద్దిరెడ్డిని నిలవరించే వ్యక్తి వచ్చారని కూటమి పార్టీలు ప్రచారం చేస్తున్నాయి.

ఎన్నికల బరిలో తండ్రీ కొడుకులు, అన్నదమ్ములు





రాజంపేట లోక్‌సభకు వైసీపీ అభ్యర్థిగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పోటీ చేస్తుండగా, ఇదే నియోజకవర్గ పరిధిలోని పుంగనూరులో ఆయన తండ్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.. తంబళ్లపల్లెలో ఆయన చిన్నాన్న ద్వారకనాథరెడ్డి పోటీ చేస్తున్నారు.

రాజంపేట లోక్‌సభ బీజేపీ అభ్యర్థిగా మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. ఇదే నియోజకవర్గ పరిధిలోని పీలేరులో టీడీపీ అభ్యర్థిగా ఆయన సోదరుడు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి బరిలో ఉన్నారు.





● గుర్తుంచుకో

మీ ఓటూ ముఖ్యమే

ఓటు విలువ తెలియజేసేలా అధికార యంత్రాంగం నెల రోజులుగా ప్రచార చర్యలు చేపట్టింది. వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. 'మీ ఓటూ ముఖ్యమే', ప్రజాస్వామ్యం నీతోనే మొదలవుతుంది' తదితర నినాదాలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తోంది. చిత్తూరులోని పలు కూడళ్లు.. జనసందడి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఈ తరహా బోర్డులను పెడుతున్నారు. ఇంకా '2024 లోక్‌సభ, శాసన సభ ఎన్నికల్లో ఓటు వేయడం మన హక్కు,యువత మేల్కొనండి, చైతన్యవంతమైన ప్రజాస్వామ్యం కోసం తప్పనిసరిగా ఓటు వినియోగించుకోండి' అంటూ ఓటు ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది. ఈ ప్రచార బోర్డులు ఓటర్లను ఆకర్షిస్తున్నాయి.

- చిత్తూరు

సిద్ధేశ్వరుడిని దర్శించుకున్నాకే ప్రచారం



● సెంటిమెంట్

ఎన్నికలు ఏ స్థాయివైనా సరే.. సిద్ధేశ్వరుడిని దర్శించుకున్నాక, ఆ గ్రామం నుంచే ప్రచారం మొదలు పెడతారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఈ సెంటిమెంట్‌ను పాటిస్తున్నారు. జీడీనెల్లూరు మండలం వింజం పంచాయతీలోని సిద్ధేశ్వరకొండ గ్రామంలో సిద్ధేశ్వరస్వామి ఆలయం ఉంది. వేపంజేరి నియోజకవర్గంగా ఉన్నప్పుడే మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ ఈ సెంటిమెంట్‌ను కొనసాగించారు. ఐదుసార్లు గెలవడం, మంత్రి, డిప్యూటీ స్పీకరు పదవులు పొందడంతో ఈ సెంటిమెంట్ బలంగా మారింది. జీడీనెల్లూరు నియోజకవర్గం ఆవిర్భవించిన తర్వాతా దీనిని పాటిస్తున్నారు. గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా కళత్తూరు నారాయణస్వామి కూడా ఈ ఆలయంలోనే పూజలుచేసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఇప్పుడూ టీడీపీ అభ్యర్థి డాక్టర్ థామస్, వైసీపీ అభ్యర్థి కృపాలక్ష్మీ కూడా వేర్వేరు రోజుల్లో ఈ ఆలయంలోనే పూజలు చేసి.. ఇక్కడే ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. మండలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచి ఎన్నికల్లోనూ పోటీచేసే అభ్యర్థులు సెంటిమెంట్‌గా సిద్ధేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేసి మొక్కుకున్నా.. ఈ గ్రామంలోనే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మరిప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లో ఈ సెంటిమెంట్ ఎవరికి వర్కవుట్ అవుతుందో చూడాలి.

- గంగాధరనెల్లూరు

144 సెక్షన్ ఎందుకు విధిస్తారు?

● మీకు తెలుసా..?

ఎన్నికలు, అల్లర్లు జరిగేటప్పుడు, పరీక్షల నిర్వహణ సమయంలో ఎక్కువగా 144 సెక్షన్ విధిస్తుంటారు. అసలు 144 సెక్షన్ అంటే ఏమిటి, ఎందుకు, ఎప్పుడు విధిస్తారో తెలుసుకుందాం. సీఆర్‌పీసీ 144 సెక్షన్ కింద ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌లకు విస్తృత అధికారాలు కల్పించారు. ప్రధానంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగిన సమయంలో పరిస్థితులను అదుపులోకి తీసుకొచ్చేందుకు ఈ సెక్షన్ అమలు చేస్తారు. సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధిస్తారు. ఈ సెక్షన్ అమల్లోకి వస్తే నలుగురు, ఐదుగురు వ్యక్తులకు మించి గుమిగూడకూడదు. కలిసి తిరగడంపైనా నిషేధాజ్ఞలు ఉంటాయి. ఎన్నికల సమయంలో నామినేషన్ల ప్రక్రియ నుంచి ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు ఈ సెక్షన్ అమల్లో ఉంటుంది. ఆ సమయంలో ప్రదర్శనలు, ఊరేగింపులు, ర్యాలీలు చేయకూడదు. ప్రధానంగా రెండు పార్టీలు, గ్రూపుల మధ్య తగాదాలు తలెత్తినప్పుడు కూడా విధిస్తారు. రెండు నెలల వరకు కలెక్టర్, ప్రభుత్వం నియమించిన మెజిస్ట్రేట్, పోలీసులు మ్యాన్యువల్ ప్రకారం ఎస్పీలు ఈ సెక్షన్‌ను అమలు చేస్తారు.

- చిత్తూరు

ఆమె ఆశీర్వాదం ఉంటేనే..!

- అభ్యర్థుల గెలుపులో మహిళా ఓటర్లే కీలకం
- పురుషులకంటే 23,528 మంది ఎక్కువ

ఎవరు గెలవాలన్నా 'ఆమె' ఆశీర్వదం ఉండాల్సిందే. అన్ని నియోజకవర్గాల్లోనూ మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. ఇక, పోలింగ్ రోజున వీరి ఓటింగ్ శాతమే అధికం. ఈ పరిణామాలతో అభ్యర్థుల గెలుపునకు మహిళా ఓటర్లు కీలకంగా మారారు. రెండు దశాబ్దాలుగానూ వీరి తీర్పే ఓటర్ల గెలుపు రాతను నిర్దేశిస్తోంది.

- చిత్తూరు కలెక్టరేట్



జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక లోక్‌సభ సెగ్మెంట్‌లో అభ్యర్థుల గెలుపునకు మహిళా ఓటర్లే కీలకంగా మారారు. జిల్లా ఓటర్ల తుది జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ మంగళవారం విడుదల చేశారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 15,63,911 మంది ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు 7,70,154, మహిళా ఓటర్లు 7,93,682 మంది, థర్డ్ జెండర్ 75 మంది ఉన్నారు. పురుషుల కంటే 23,528 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉండడం విశేషం. చిత్తూరు, పలమనేరు, పుంగనూరు, కుప్పం, పూతలపట్టు, గంగాధరనెల్లూరు, నగరి నియోజకవర్గాల్లో పురుష ఓటర్లకంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల్లో గెలుపుకోసం మహిళా ఓటర్లను ఆకర్షించేలా మ్యానిఫెస్టోలో ప్రత్యేక పథకాలు ప్రకటించాయి. సరికొత్త పథకాలతో మహిళా ఓటర్లను ఆకర్షించే పనిలో తలమునకలయ్యాయి. ఏదిఏమైనా జిల్లాలో రానున్న ఎన్నికల్లో గెలుపోటములను నిర్ణయించేది మహిళా ఓటర్లేనని విశ్లేషకులు చెబుతున్నారు. మరి వీరంతా ఎవరిని ఆశీర్వదిస్తారో చూడాలి. రెండు దశాబ్దాలుగానూ మహిళా ఓటర్ల తీర్పే అభ్యర్థుల విజయావకాశాలను నిర్ణయిస్తోంది. వీరు ఎక్కువగా ఉండటం, గంపగుత్తగా ఓట్లు వేయడం వల్ల వీరి ప్రభావం అధికంగా ఉంది.

నియోజకవర్గం	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	థర్డ్ జెండర్	మొత్తం ఓటర్లు
పుంగనూరు	1,17,072	1,21,791	05	2,38,868
నగరి	98,537	1,04,029	08	2,02,574
జీడీనెల్లూరు	1,01,853	1,03,090	06	2,04,949
చిత్తూరు	98,718	1,04,101	31	2,02,850
పూతలపట్టు	1,08,811	1,12,181	07	2,20,999
పలమనేరు	1,32,653	1,35,243	00	2,67,896
కుప్పం	1,12,510	1,13,247	18	2,25,775
మొత్తం	7,70,154	7,93,682	75	15,63,911

ప్రచార రథాల దహనంపై కేసు నమోదు

● ఏడుగురు వైసీపీ నాయకుల అరెస్టు ● కేసును స్వయంగా పర్యవేక్షించిన ఎస్పీ కృష్ణారావు ● వివరాలు వెల్లడించిన రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా

పీలేరు, ఏప్రిల్ 30: భారత చైతన్య యువజన పార్టీ (బీసీవైపీ) ప్రచార వాహనాల దహనం, ధ్వంసం ఘటనపై ఐపీసీ 307 కింద కేసు నమోదు చేసినట్లు రాయచోటి డీఎస్పీ సయ్యద్ మహబూబ్‌బాషా తెలిపారు. పీలేరు మండలం వేపులబైలు పంచాయతీ వరంపాటివారిపల్లె వద్ద బీసీవై పార్టీకి చెందిన రెండు ప్రచార రథాలను దహనం చేయడంతో పాటు మరో రెండు రథాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. ఈ సంఘటనపై మంగళవారం పీలేరు అర్బన్ సీఐ కార్యాలయంలో రాయచోటి డీఎస్పీ విలేకరులతో మాట్లాడారు. వేపులబైలు ఘటనలో ప్రైవేటు వ్యక్తులు ఎవరూ ఫిర్యాదు చేయలేదని, పీలేరు నియోజకవర్గ మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ) అమలు నోడల్ అధికారి, పీలేరు ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి ఎన్నికల విధుల్లో భాగంగా ఫిర్యాదు చేశారన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు పీలేరు అర్బన్ స్టేషన్‌లో క్రైమ్ నెం.121/2024గా ఐపీసీ సెక్షన్లు 307, 341, 427, 435 కింద కేసు నమోదు చేశామన్నారు. ఎస్పీ కృష్ణారావు స్వయంగా కేసు నమోదు ప్రక్రియను పర్యవేక్షించారని డీఎస్పీ వెల్లడించారు. ఈ కేసులో తమకు అందిన ప్రాథమిక సమాచారం మేరకు పీలేరు మండలం కాకులారంపల్లెకు చెందిన వైసీపీ నాయకుడు కొత్తపల్లె సురేశ్ కుమార్‌రెడ్డి (కాకులారంపల్లె సర్పంచ్ హరిణి భర్త), పీలేరు పట్టణం యల్లమంద క్రాసుకు చెందిన సునీల్‌కుమార్ రెడ్డి (పీలేరు పట్టణ సచివాలయం-2 కన్వీనర్), దీపు, కరీం, మధు, వెంకటరమణ, సాయి అనే ఏడుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ సంఘటనలో మరి కొంతమంది పాల్గొన్నట్లు సమాచారం ఉందని, వారందరినీ త్వరలోనే పట్టుకుంటామన్నారు. సంఘటన జరిగినప్పుడు సంఘటనా స్థలానికి సమీపంలో ఉన్న పీలేరు పట్టణానికి చెందిన ఓ మైనారిటీ వైసీపీ నేత వాహనం ఆ తరువాత కనిపించకపోవడంపై పోలీసుల ప్రమేయం ఉందని పాత్రికేయులు ప్రశ్నించగా దాని గురించి తనకు తెలియదన్నారు.



పీలేరులో విలేఖరులతో మాట్లాడుతున్న డీఎస్పీ సయ్యద్ మహబూబ్ బాషా

పీలేరులో ఎస్పీ కృష్ణారావు మకాం

బీసీవై పార్టీ ప్రచార వాహనాల సంఘటన గురించి తెలుసుకున్న ఎస్పీ కృష్ణారావు పీలేరులోనే మకాం వేసి సోమవారం రాత్రి 12 గంటల ప్రాంతంలో వారిలో కొంత మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేసుకుని మంగళవారం ఉదయం అరెస్టు చేశారు.

వైసిపీ నేత వాహనం మాయంపై మండిపాటు

వేపులబైలు వద్ద బీసీవై పార్టీ ప్రచార రథాలపై దాడికి వచ్చిన వారు ఉపయోగించినట్లుగా అనుమానిస్తున్న ఓ మహీంద్రా బొలెరో వాహనం సంఘటనా స్థలం నుంచి మాయం కావడంపై టీడీపీ నేతలు మండిపడ్డారు. సంఘటనా స్థలాన్ని సోమవారం సాయంత్రం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సందర్శించారు. ఆ సమయంలో ఆ స్థలానికి కేవలం 20 అడుగుల దూరంలో చీకటిలో పీలేరుకు చెందిన అధికార పార్టీ మైనారిటీ నేతకు చెందిన వాహనం గమనించిన స్థానికులు ఆ విషయాన్ని కిశోర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆ విషయాన్ని ఆ సమయంలో అక్కడున్న పోలీసులకు తెలిపారు. వాహనాన్ని సీజ్ చేయాలని, కేసు దర్యాప్తుకు ఆ వాహనం ఉపయోగపడుతుందని కిశోర్ పోలీసులకు తెలిపారు. అయితే సోమవారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో ఆ వాహనాన్ని అక్కడి నుంచి ఎవరో తీసుకెళ్లిపోయారని గ్రామస్తులు తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా ఆ వాహనం అక్కడి నుంచి మాయం కావడంపై మంగళవారం కిశోర్ కుమార్ రెడ్డి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, ప్రాణాంతక దాడులు జరిగిన సమయంలో కూడా అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు లొంగిపోతే ఎలా అంటూ అసహనం వ్యక్తం చేశారు. వాహనం మాయం కావడంపై ఉన్నతాధికారులతోపాటు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

అజ్ఞాతంలోకి అధికార పార్టీ నేతలు

వేపులబైలు వద్ద బీసీవై పార్టీ ప్రచార వాహనాలపై దాడిలో పాల్గొన్న చాలా మంది అధికార పార్టీ నేతలు, కార్యకర్తలు సోమవారం రాత్రి నుంచి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. దాడి ఘటనను పోలీసులు సీరియస్‌గా తీసుకున్న విషయాన్ని పసిగట్టిన వైసీపీ అగ్రనాయకులు అందులో పాల్గొన్న వారికి ఫోన్లు చేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోవాలని ఆదేశించినట్లు సమాచారం. తాము చెప్పే వరకు బయటకు రావొద్దని సూచించినట్లు తెలిసింది.

వాహనాల దాడిపై మరో ఫిర్యాదు

పీలేరు, ఏప్రిల్ 30: బీసీవైపీ ప్రచార వాహనాలపై దాడికి పాల్పడిన వారు తనపై దౌర్జన్యం చేయడమే కాకుండా తన సెల్‌ఫోన్‌ను లాక్కున్నారంటూ వేపుల బైలుకు చెందిన టీడీపీ నేత గాయం వెంకటరెడ్డి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ సమయంలో పీలేరుకు చెందిన వైసీపీ నాయకులు సురేశ్ కుమార్ రెడ్డి, ఆనంద, ఉదయ, పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, మాజీ సర్పంచ్ హబీబ్, పవన్ కుమార్ రెడ్డి, గాయం నాగభూషణం రెడ్డి సుమారు 100 మందికిపైగా తమ అనుచరులతో వాహనాలను దహనం చేయడం చూశాననిభావించి తనపై దౌర్జన్యం చేసి సెల్‌ఫోన్‌ను లెక్కెళ్లిపోయారని పీలేరు ఎస్ఐ నరసింహుడుకు ఫిర్యాదు అందజేశాడు.



సంఘటనా స్థలానికి సమీపంలో నిలిచి ఉన్న వైసీపీ నాయకుడి వాహనం

వైసీపీ పాలనలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి

● వివేకా హత్యకేసును ఇంత వరకు తేల్చలేదు
● రామచంద్రయాదవ్‌పై దాడి చేయడం దుర్మార్గం ● మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి



కురబలకోటలో రోడ్ షోలో ప్రసంగిస్తున్న మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

కురబలకోట, ఏప్రిల్ 30: వైసీపీ పాలనలలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని జంగావారిపల్లె నుంచి కురబలకోట వరకు రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా కురబలకోటలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ చిన్నాన్న వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు గురై ఐదేళ్లు కావస్తున్న ఇప్పటి దాకా కేసును తేల్చలేదన్నారు. బీసీ నేత రామచంద్రయాదవ్ సొంత పార్టీ పెట్టుకుని సదుం మండలంలో పర్యటిస్తే పెద్దిరెడ్డి కుటుంబీకులు స్వయంగా పోలీస్‌స్టేషన్ ఎదుటే వాహనాలను దగ్ధం చేశారని, ఈ దుశ్చర్యలకు పాల్పడిన వారిని ఇప్పటి దాకా అరెస్ట్ చేయడం లేదంటే శాంతిభద్రతలు ఏవిధంగా ఉన్నాయో మీరే అర్థం చేసుకోవాలన్నారు. ప్రశాంతతకు మారుపేరైన తంబళ్లపల్లె నియోజకవర్గంలో రౌడీయిజం వచ్చేసిందని, వాటిని అరికట్టడానికి రానున్న ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తంబళ్లపల్లె కూటమి అభ్యర్థి జయచంద్రారెడ్డి మాజీ మంత్రి పనబాక లక్ష్మి, బీజేపీ నేత చల్లపల్లె నరసింహారెడ్డి, రాజంపేట బీజేపీ పార్లమెంటరీ ఇన్‌ఛార్జ్ సాయి లోకేష్, నియోజకవర్గ పరిశీలకుడు సీడ్ మల్లికార్జున నాయుడు, రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, మండల కన్వీనర్ వైజీసురేంద్ర, పార్లమెంటరీ తెలుగు యువత ప్రధానకార్యదర్శి అయూబ్‌బాషా, ఎల్లుట్ల మురళి, వెంకటరమణారెడ్డి, నజీబ్, వైజి రమణ, శ్రీనాథ్‌రెడ్డి, డిఆర్ వెంకటరమణారెడ్డి, శంకర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలతోనే రాష్ట్రాభివృద్ధి

నిమ్మనపల్లి, ఏప్రిల్ 30: టీడీపీ ప్రవేశ పెట్టిన సూపర్‌సిక్స్ పథకాలతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మదనపల్లె కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం ముష్టూరు పంచాయతీలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. యర్రప్పగారిపల్లికి చెందిన కాంగ్రెస్ నేత మాజీ జడ్పీటీసీ వెంకటక్రిష్ణను సాదరంగా టీడీపీలోకి ఆహ్వానించారు. సార్వత్రిక ఎన్నికలలో భాగంగా ఎన్ఆర్ఐ తెలుగుదేశం టీమ్ సభ్యులు వెంకటేశ్వరరావు, శ్రీరాములు, వోలేటిదివాకర్, ఉదయప్రకాష్, పెరుగుశ్రీనివాస్, సురేష్‌బాబు కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషాను కలసి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటరమణ, రాజంపేటఅధికార ప్రతినిధి ఆర్వే వెంకటేష్, మాజీ ఎంపీపీ రెడ్డెప్పరెడ్డి, మాజీ జిల్లా కో-ఆప్షన్ నెంబరు సుధాకర్‌రావు, బీసీ అధికార ప్రతినిధి లక్ష్మన్న, సర్పంచ్ రెడ్డెప్ప, మాజీ ఎంపీపీ రామకృష్ణ, బీసీ అధికార ప్రతినిధి లక్ష్మన్నలు మాజీ సర్పంచ్‌లు రాజన్న, రమణ, మల్లప్ప, మహమ్మద్‌రఫీ, శ్రీరాములు, మల్లికార్జున, దామోదర్‌రెడ్డి, నాయకులు కేశవ, గోపాలక్రిష్ణ, చంద్రసింగ్, సోము, శ్రీనివాసులు, నరసింహులు, శ్రీపతి, సుధాకర్, సహదేవ, జగదీష్, రెడ్డెప్ప, జయన్న, చినబాబు, చెంద్రాయుడు, ఖసింమ్‌ఖాన్, బాబు, చంద్ర, జనసేన నేతలు ప్రదీప్, చంద్రశేఖర్, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

ఉమ్మడి మేనిఫెస్టోకు ప్రజాదరణ

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 30: టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ప్రకటించిన ఉమ్మడి మ్యానిఫెస్టోకు ప్రజాధరణ వస్తోందని స్టార్ క్యాంపైనర్, కేంద్ర మాజీమంత్రి పనబాక లక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం మదనపల్లెలో ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈ సారి జరిగే ఎన్నికలు ప్రతిష్టాత్మకమైనవన్నారు. బాబుష్యూరిటీతో రాష్ట్ర ప్రజలకు భవిష్యత్ గ్యారెంటీ ఇస్తున్నారన్నారు. జనసేన పవన్‌కళ్యాణ్, చంద్రబాబు సరైన పాలన అందిస్తారన్నారు. తల్లికి వందనం పేరిట ఎంత మంది బిడ్డలున్నా రూ.15వేలు ఆర్థిక సహాయం, ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్ల నుంచి 58 సంవత్సరాల వరకు రూ.1500, మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితం, మంచి నీటి కుళాయి కనెక్షన్‌లు, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, ఇస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా, జనసేన నాయకురాలు దారం అనిత, మధుబాబు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి ఓటు వేయండి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 30: ప్రజా స్వామ్యానికి ఓటు వేయాలని, పెత్తందారుల నుంచి మదపల్లెను కాపాడుకోవాలని కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి మల్లెల పవన్‌కుమార్‌రెడ్డికి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు మంగళవారం స్థానిక నీరుగట్టువారిపల్లెలో మార్కెట్ యార్డు వద్ద రైతులను ఓట్లు అభ్యర్థించారు. విశేషజవాహినితో నీరుగట్టువారిపల్లె, కాట్లాటపల్లె, బాబుకాలనీ, చీకలబైలులో ప్రచారం చేశారు. నీరుగట్టువారిపల్లె పట్టుకు బ్రాండ్ అంబాసిడర్ కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ మురళి, రెడ్డి, 2 సలీమ్, మహబూబ్‌సాహెబ్, అజ్గార్, బావజాన్, పుల్లయ్య, ఎండీరఫీ పాల్గొన్నారు.

వైసీపీ నేతతో కిరణ్‌కుమార్‌రెడ్డి భేటీ



అమరనాథ్ నివాసంలో అభ్యర్థులు కిరణ్‌కుమార్‌రెడ్డి, జయచంద్రారెడ్డి

బి.కొత్తకోట, ఏప్రిల్30: బి.కొత్తకోట సింగిల్‌విండో అధ్యక్షుడు, వైసీపీ కాపు నేత తిరుమల అమరనాథ్ తో కూటమి అభ్యర్థులు నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి, జయచంద్రారెడ్డిలు మంగళవారం భేటీ అయ్యారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వారు మంగళవారం బి.కొత్తకోటలో పర్యటించిన వారు స్థానిక నాయకుల సూచన మేరకు కొద్దిమంది అనుచరులతో అమరనాథ్ నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్‌రెడ్డి, జయచంద్రారెడ్డిలను ఆయన సాదరంగా ఆహ్వానించారు. కొద్దిసేపు వారితో రాజకీయ పరిస్థితి పై ముచ్చటించారు. తమకు మద్దతు ఇవ్వాల్సిందిగా కోరారు. దీనిపై అమనరాథ్ సానుకూలంగా స్పందించినట్లు టీడీపీ వర్గాలు పేర్కొన్నాయి. ప్రముఖ కాపునాయకుడిగా, వైసీపీ నేతగా వున్న అమర్ కూటమి అభ్యర్థులతో ములాకత్ కావడం పట్టణంలో చర్చనీయాంశం అయింది.

మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 30: తనకు ఇష్టమైన వ్యక్తితో సహజీవనానికి ఆయన భార్య ఒప్పుకోలేదని ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించింది. మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెకు చెందిన అంజలి(24) భర్త శివకుమార్ మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. వారికి ఇద్దరు పిల్లలు వుండగా, అంజలి అదే ప్రాంతానికి చెందిన గోపితో స్నేహం పెంచుకుని తన ఇద్దరు బిడ్డలను అతని ఇంట్లో వదిలి జీవనం కోసం కువైట్‌కు వెళ్లింది. అక్కడి నుంచి ప్రతి నెలా తన ఇద్దరు బిడ్డల పోషణకు రూ.30వేలు గోపికి పంపేది. ఈ క్రమంలో ఇటీవల మదనపల్లెకు చేరుకున్న అంజలి తను కూడా గోపి ఇంట్లోనే వుంటూ సహజీవనం చేస్తానని చెప్పింది. దీనికి గోపి భార్య నాగమణి ఒప్పుకోకపోవడంతో పాటు గొడవ పడింది. దీంతో మనస్థాపం చెందిన అంజలి పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన స్థానికులు ఆమెను మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

దాడి కేసులో వ్యక్తి అరెస్టు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 30:స్కార్పియో అద్దాలను పగలకొట్టిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు సోమవారం రాత్రి కడపజిల్లా చక్రాయలపేట మండలానికి చెందిన వ్యక్తి తన 9నెలల కొడుకు ఆరోగ్యరీత్యా మదనపల్లెకు తన సొంత స్కార్పియో వాహనంలో భార్య తోపాటు చికిత్స కోసం మదనపల్లెకు వస్తుండగా వాహనం వెనుకవైపు అద్దాలు దౌర్జన్యంగా పగలకొట్టి వాహన యాజమానిని భయభ్రాంతులకు గురిచేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై టూటౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య కేసు నమోదు చేసి, నిందితు డు మదపల్లె మండలం, వేంపల్లె పంచాయతీ, బొమ్మనచెరువుకు చెందిన రవి (49)గా గుర్తించి మంగళవారం అరెస్టు చేసి రిమాండ్ తరలించామని ఎస్ఐ తెలిపారు.

ఎన్నికల నియమావళి తప్పక పాటించాలి

తంబళ్లపల్లె, ఏప్రిల్ 30: ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలని పరిశీలకురాలు కవిత మన్నికేరి సూచించారు. మంగళవారం స్థానిక ఆర్వో కార్యాలయంలో ఎన్నికల వ్యయ పరిశీలకులు వైభవ్‌శుక్లాతో కలసి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులకు ఎన్నికల ప్రవర్తన నియమావళిపై అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రాల వద్ద రాజకీయ పార్టీ నాయకుల చిత్రాలు, స్వతంత్ర అభ్యర్థులకు కేటాయించిన గుర్తులు ఉండకుండా అధికారులు చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్వో రాఘవేంద్ర, ఏఆర్వో బ్రహ్మయ్య, ఎంపీడీవో కృష్ణమూర్తి, ఎన్నికల అధికారులు, పలువురు అభ్యర్థులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన

పీలేరు, ఏప్రిల్ 30: పీలేరు పట్టణంలోని ఏఎంసీ ప్రాంగణంలో ఉన్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను మంగళవారం కేంద్ర ఎన్నికల సంఘ పరిశీలకులు పరిశీలించారు. పోలీసు శాఖ పరిశీలకులు, ఐపీ ఎస్ అధికారి నవాజ్ అహ్మద్, రాజంపేట పార్లమెంటు ఎన్నికల వ్య య పరిశీలకులు, ఐఆర్ఎస్ అధికారి రవీంద్ర కుమార్, రాజంపేట, రాయచోటి, రైల్వే కోడూరు, పీలేరు అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు ఎస్‌జీ మూన్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన వారిలో ఉన్నారు. ఏఎంసీ ప్రాంగణంలోని పోలింగ్ కేంద్రాలు 224, 266, 267, 262, 263, 268, 269 సమస్యాత్మకంగా ఉండడంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వాటిని సందర్శించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్వో మహబూబ్ బాషా, ఆర్ఐ చాణక్య పాల్గొన్నారు.

నేడు కమ్మ యూత్ సమావేశం

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 30: మదనపల్లె పట్టణం శేషసాయి కళ్యాణ మండపంలో బుధవారం కమ్మ యూత్ సమావేశం నిర్వహించనున్నట్లు మార్పూరి వరుణ్, పెరవలి నవీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి మదనపల్లె నియోజకవర్గంలోని యువత అందరు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నడిమిఖండ్రిగలో నీటి ఎద్దడి

గుర్రంకొండ, ఏప్రిల్ 30:గుర్రంకొండ మండలం నడిమిఖండ్రిగ గ్రామంలో ప్రజలు తాగునీటి కోసం తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ప్రజల తాగునీటి కోసం రెండు బోర్ల వేయగా వాటిలో నీటి మట్టం తగ్గడంతో పది రోజులుగా ప్రజలు తాగునీటి కోసం కష్టాలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో తాగునీటి కోసం వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నారు. అధికారులు స్పందించి నీటి సమస్య తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి



ఏఎస్ఐ రెడ్డెప్పను సన్మానిస్తున్న డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 30: ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి అని మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక టూటౌన్ పోలీసుస్టేషన్ సీఐ యువరాజు అధ్యక్షత గత 40 ఏళ్లుగా పోలీసు శాఖలో పని చేసి పదవీవిరమణ చేసిన ఏఎస్ఐ రెడ్డెప్పను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో ఏఎస్ఐ రెడ్డెప్ప చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటసుబ్బయ్య, ఏఎస్ఐలు ఇమామ్‌సాహెబ్, వైవి రమణ, చంద్రయ్య, బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

సీహెచ్‌వో లక్ష్మీపతి పదవీ విరమణ

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 30 : పీటీఎం ప్రభుత్వ ఆసుపత్రిలో సీహెచ్‌వోగా విధులు నిర్వర్తిస్తున్న లక్ష్మీపతి మంగళవారం పదవీ విరమణ చేశారు. స్థానిక ఆసుపత్రి ఆవరణలో తోటి సిబ్బంది వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేసి లక్ష్మీపతి భార్య రాదమ్మను శాలువలతో ఘనంగా సత్కరించారు. ఆసుపత్రి డాక్టర్లు పురుషోత్తం నాయక్, మహ్మద్ ఎస్తానీలు ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి బియ్యం వితరణ

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 30: మదనపల్లె మండలం బసినికొండ వద్ద కూరపర్తి సాయిచైతన్య అనాథాశ్రమానికి దాతలు 10 బస్తాల బియ్యాన్ని వితరణగా అందజేశారు. మంగళవారం తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెకు చెందిన ఆర్.కళావతి తనయుడు ఆర్.యుగంధర్ రూ.23వేల విలువ చేసే బియ్యంను ఆశ్రమ నిర్వాహకులు పద్మనాభరెడ్డికి అందజేశారు. యుగంధర్ మాట్లాడుతూ తన తండ్రి రఘునాథరెడ్డి వర్థంతి సందర్భంగా ప్రతి ఏటా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బాబు, స్వరూపారాణి పాల్గొన్నారు.

ఆదరించండి.. అభివృద్ధి చేసి చూపిస్తాం



నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి జయచంద్రారెడ్డిలను ఘనంగా సత్కరిస్తున్న కూటమి నాయకులు

పెద్దతిప్పసముద్రం/బి.కొత్తకోట, ఏప్రిల్ 30 :సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల ను ఆదరించి.. గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తామని రాజంపేట పార్లమెంట్ కూటమి అభ్యర్థి, నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి, తంబళ్లపల్లె కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డిలు ప్రజలను కోరారు. మంగళవారం వారు పీటీఎం మండలం టి.సదుం పంచాయతీ చెన్నరా యునిపల్లె క్రాస్‌లోని శ్రీచౌడేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి అభ్యర్థులను గెలిపిస్తే నియోజకవర్గాన్ని పారిశ్రామిక కారిడర్ గా చేసి నిరుద్యోగులకు ఉపాది అవకాశాలు కల్పించి సుపరిపాలన అంది స్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు సాయిలోకేష్, సీనియర్ నాయకుడు చల్లపల్లె నరసింహారెడ్డి, ములకలచెరువు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి, జనసేన తంబళ్లపల్లె ఇంచార్జ్ పోతుల సాయినాథ్, టీడీపీ బీసి సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, రాజంపేట పార్లమెంట్ బీసి సెల్ అధ్యక్షుడు సురేంద్ర యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కేవీ రమణ, పీటీఎం మండల కన్వీనర్ ఆనంద్‌రెడ్డి ములకలచెరువు మండల అధ్యక్షుడు పాలగిరి సిద్దా, మాజీ జడ్పీటీసీ ఈశ్వరప్ప, తాడిగోళ్లపల్లె సుధాకర్‌రెడ్డి, బయ్యారెడ్డి, మనోజ్ జయంత్ రెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు శంకర, నాగరాజు పాల్గొన్నారు. ఎన్ఆర్‌సి, సీఏఏలపై అపోహలను వీడి ముస్లిం మైనారిటీలు ఎన్డీయే అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని బి.కొత్తకోటలో జరిగిన ఎన్నికల ప్రచారంలో కూటమి పార్లమెంటు అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి జయచంద్రారెడ్డిలు కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్, రాటకొండ బాబురెడ్డి, కుడుం శ్రీనివాసులు, నారాయణస్వామిరెడ్డి, చింతల కిరణ్, మొటుకుశివ, మస్తాన్, సమీవుల్లా, రియాజ్‌అలీఖాన్, సుకుమార్ పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే పొత్తుపై వైసీపీ విషప్రచారం



పీలేరులో నల్లారి కిశోర్ కుమార్ రెడ్డిని సన్మానిస్తున్న రేగళ్ల ముస్లింలు



వాల్మీకిపురంలో ప్రచారం నిర్వహిస్తున్న నల్లారి తనూజారెడ్డి

పీలేరు, ఏప్రిల్ 30: ఓటమి భయంతోనే టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తుపై వైసీపీ విషప్రచారం చేస్తోందని, దానిని సమర్థవంతంగా తిప్పికొట్టాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి కూటమిలోని ముస్లింలకు పిలుపునిచ్చారు. పీలేరు మండలం దొడ్డిపల్లె, రేగల్లు గ్రామాల్లో మంగళవారం అయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా రేగళ్ల గ్రామంలో ఆయన మాట్లాడుతూ పొత్తులో ఉన్నప్పటికీ దేశంలోనే అత్యంత సెక్యులర్ నాయకుడైన చంద్రబాబు ముస్లిం మైనారిటీల ప్రయోజనాలు కాపాడుతారన్నారు. 2014-19 మధ్యకాలంలో బీజేపీతో పొత్తు ఉన్నప్పటికీ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రప్రథమంగా రాష్ట్రంలోని ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనాలు ప్రవేశపెట్టిన విషయం ముస్లింలు గుర్తు చేసుకోవాలన్నారు. తన అన్న ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పీలేరు నియోజకవర్గంలోని ముస్లింలు అడగకపోయినా అనేక మసీదులు, శ్మశాన వాటికల అభివృద్ధికి నిధులు కేటాయించామన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికలలో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా తన అన్న నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని అత్యధిక మెజారిటీలో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో దొడ్డిపల్లె, రేగళ్ల గ్రామాల్లోని టీడీపీ, జనసేన శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను ఆదరించి..గెలిపించండి

వాల్మీకిపురం, ఏప్రిల్ 30: అభివృద్ధి, సంక్షేమం కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను ఎన్నికల్లో ఆదరించి.. గెలిపించాలని పీలేరు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సతీమణి నల్లారి తనూజారెడ్డి ఓటర్లను కోరారు. మంగళవారం వాల్మీకిపురం మండలంలోని విఠలం గ్రామ పంచాయతీలో ఆమె పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గంలో ఇంటింటా ప్రజలంతా ఆదరిస్తున్నారని ఇదే ఆదరణ 13న జరిగే ఎన్నికల్లో తమ ఓట్లతో ఎంపీ గా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేగా నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిలను కమలం, సైకిల్ గుర్తులపై ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నల్లారి కుటుంబం ఎల్లవేళలా ప్రజా సేవకే పాటు పడుతుంద న్నా రు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బెజవాడ దినేష్, మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, పీలేరు తెలుగు యువత ఉపాధ్యక్షుడు లంకిపల్లె మధు, మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, నాయకులు కృష్ణారెడ్డి, పీవీనారాయణ, రాజేంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

తగలబెట్టే నీచ సంస్కృతి నల్లారి వంశంలో లేదు

అల్లర్లు సృష్టించడం వాహనాలను తగలబెట్టి అరాచకాలు చేసే నీచ సంస్కృతి నల్లారి వంశంలోనే లేదని వాల్మీకిపురం టీడీపీ నాయకులుపేర్కొన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రచార రథాన్ని టీడీపీ వారే కాల్చేశారంటూ వైసీపీ నేతలు అసత్య ప్రచారాలు చేయడం సిగ్గు చేటన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు ద్వారకనాథ రెడ్డి, చింతపర్తి మాజీ సర్పంచ్ జగన్నాథరెడ్డి, నాయకులు కువైట్ సయ్యద్ బాషా, చంద్రారెడ్డి, సైదు, ఆనంద్, బాబు, డిష్ బ్రదర్స్ పాల్గొన్నారు.